RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 52 | శుక్రవారం, మార్చి 22, 2024 | పేజీలు : 4

## చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబుతో జనసేనాని పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని చంద్రబాబు నివాసానికి పవన్ వెళ్లారు. ఏపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వీరిద్దరూ చర్చిస్తున్నారు. పెండింగ్ అభ్యర్థులు, ఎన్నికల ప్రచారం గురించి చర్చిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు ఉమ్మడిగా ప్రచారాన్ని నిర్వహించడంపై చర్చిస్తున్నారు. సభలు, సమావేశాలు ఎక్కడెక్కడ నిర్వహించాలనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. ఈ 50 రోజులను ఎలా వినియోగించుకోవాలనే దానిపై చర్చిస్తున్నారు.




న్యూఢిల్లీ: ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ ను ఇడి అధికారులు అరెస్టు చేశారు. డిల్లీ లిక్కర్ కేసులో గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఆయన నివాసంలో ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. సెర్చ్ వారెంట్ నోటీసులు ఇచ్చి రెండు గంటలపాటు సోదాలు జరిపిన ఇడి అధికారులు.. అనంతరం కేజ్రీవాల్ ను అరెస్టు చేశారు. ఇడి సోదాలు నేపథ్యంలో కేజ్రీవాల్ నివాసం దగ్గరకు పెద్ద ఎత్తున ఆప్ కార్యకర్తలు చేరుకుని ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆప్ నాయకులు, కార్యకర్తుల రావడంతో ఆయన నివాసం భారీగా పోలీసులు మోహరించారు. దీంతో కేజ్రీవాల్ ఇంటివద్ద ఉద్రిక్తత నెలకొంది. ఇక, కేజ్రీవాల్ అరెస్టును ఆప్ మంత్రులు, ఇండియా కూటమి నేతలు ఖండించారు. ప్రతిపక్షాలను భయపెట్టేందుకే కేజ్రీవాల్ ను అరెస్టు చేయించారని ఆరోపిస్తున్నారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు మోడీ పాల్పడుతున్నాడని ఆప్ మంత్రి అతిషీ విమర్శించారు. జైలు నుంచే కేజ్రీవాల్ పాలన కొనసాగిస్తారని ఆమె తెలిపింది.

### మల్కాజిగిరిలో...

## కాంగ్రెస్ జండా ఎగరాల్సిందే



మల్కాజిగిరి / హైదరాబాద్ మార్చి, 21 : తాను సీఎం కుర్చీలో కూర్చోవడానికి మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలే కారణమన్నారు పిసిసి తెలంగాణ చీఫ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నాడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు భుజాలపై జెండా మోసి తనను ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు.

మల్కాజిగిరి నేతలతో రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2,964 బూత్‌లలో ప్రతీ బూత్‌లో ఒక సైనికుడిలా కార్యకర్తలు పనిచేశారని అన్నారు. దేశంలోనే అతిపెద్ద లోక్ సభ స్థానం మల్కాజిగిరి అని.. మల్కాజిగిరి గెలుపు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందని తెలిపారు. కేసీఆర్ పతనం 2019 మల్కాజిగిరి పార్లమెంట్ నుంచే మొదలైందని అన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా మల్కాజిగిరిలో పరిధిలో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదని గుర్తుచేశారు.

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం నాలుగు స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది అన్నారు. అందుకే మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి.. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు రేవంత్ రెడ్డి. లోక్ సభతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవాలని సూచించారు.

హోలీ పండగలోగా అధిష్టానం అభ్యర్థులను ప్రకటిస్తుందని.. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. బలమైన నాయకత్వం ఉంది.. సమన్వయంతో ముందుకెళ్ళాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఏడు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులు ఒక ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకోవాలన్నారు.. మల్కాజిగిరి లో గెలుపు అభ్యర్థిది కాదు.. తనది అని అన్నారు.

### సీఎం పదవిపై మంత్రి పొంగులేటి...

## కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ మార్చి, 21 : సీఎం పదవిపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో నేను చాలా జూనియర్‌ని.. నేనెలా సీఎం అవుతానని ప్రశ్నించారు. గురువారం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఎవరికి తోచిన విధంగా వాళ్ల రాసుకుంటున్నారు.. సీఎం అవుతానని నేను అనుకుంటే అది బుద్ధి తక్కువ తనం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ధరణిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధరణకి సంబంధించి తన వద్ద మరింత సమాచారం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూస్తామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు కూడా పరిష్కరిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి ఫోన్లు ట్యాపింగ్ చేయడం లేదని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ ల 11కు పైగా ఎంపీ సీట్లు ఈజీగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ అకౌంట్లను ఫ్రీజ్

హైదరాబాద్: ఎలక్టోరల్ బాండ్లు తీవ్రమైన అంశమని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. గురువారం సోనియా మీడియాతో మాట్లాడారు. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే కుట్ర కనిపిస్తోందని, కేంద్రం తీరు సరిగా లేదని, కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ అకౌంట్లపై ముప్పేట దాడి జరుగుతోందని, అకౌంట్లను ఫ్రీజ్ చేయడమనేది దారుణమైన విషయమని సోనియా గాంధీ మండిపడ్డారు. నిధుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోనియా ఆగ్రహంవ్యక్తం చేశారు.

### కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాలని చూస్తున్నారు: ఖర్గే

ఢిల్లీ: కాంగ్రెస్‌కు వచ్చిన ఎలక్టోరల్ బాండ్లు 11 శాతమేనని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. గురువారం ఖర్గే మీడియాతో మాట్లాడారు. బిజెపికి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఫండ్ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందని ఖర్గే మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమయం చూసి కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాలని బిజెపి అగ్రనేతలు చూస్తున్నారని దుయ్యబట్టారు.

### మూడో జాబితా ప్రకటించిన కాంగ్రెస్...

## తెలంగాణ నుంచి మరో ఐదుగురు ఖరారు



హైదరాబాద్ మార్చి, 21 : లోక సభకు పోటీ చేసే అభ్యర్థుల మూడో జాబితా ప్రకటించింది కాంగ్రెస్. ఇందులో 57 మంది ఎంపి అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. ఇక, తెలంగాణ నుంచి మరో ఐదుగురు ఎంపి అభ్యర్థులను ఖరారు చేసింది ఎఐసిసి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎంపి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, పట్నం సునీత మహేందర్ రెడ్డిలకు చోటు దక్కింది. ఇందులో మల్కాజ్ గిరి నుంచి పట్నం సునీత మహేందర్ రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, నాగర్ కర్నూల్ నుంచి మల్లు రవి, చేవెళ్ల నుంచి గడ్డం రంజిత్ రెడ్డిలను ఎంపిక చేశారు. కాగా, తొలి జాబితాలో తెలంగాణ నుంచి నాలుగురు ఎంపి అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. జహీరాబాద్ నుంచి సురేశ్ కుమార్ షెట్కర్, నల్గొండ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి చల్లా వంశీచందర్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్ లను ఎంపిక చేశారు. ఇక.. ఖమ్మం, భువనగిరి, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

### వాట్సాప్‌లో వికసిత్ భారత్ మెసేజ్‌లు...

## ఆపండి




న్యూఢిల్లీ: మొబైల్ యూజర్లకు ఇప్పటికీ వికసిత్ భారత్ పేరుతో వాట్సాప్‌లో మెసేజ్‌లు వస్తున్నాయి. అది ఎన్నికల నిబంధనలకు విరుద్ధం అని కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు వచ్చాయి. దాంతో ఈసీ చర్యలకు ఉపక్రమించింది. వాట్సాప్‌లో వికసిత్ భారత్ పేరుతో మెసేజ్‌లను తక్షణమే ఆపాలని గురువారం ఐటీ మంత్రిత్వశాఖకు ఆదేశాలు జారీ చేసింది. పారదర్శకతను నిర్ధారించేందుకు తాము తీసుకుంటున్న చర్యలో ఇదో భాగమని ఎన్నికల సంఘం పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కొద్ది గంటల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుందనగా, ప్రధాని మోడీ లేఖతో ఉన్న వాట్సాప్ సందేశాలను కేంద్రం పంపింది. 'వికసిత్ భారత్ సంపర్క్' పేరిట అవి వస్తున్నాయి. నెట్‌వర్క్ పరిమితుల కారణంగా మార్చి 16 న పంపిన సందేశాలు కొందరికి ఆలస్యంగా డెలివరీ అవుతున్నాయని ఈసీకి ఐటీ శాఖ వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసే మెసేజ్‌లు వస్తున్నాయని ఈసీకి ఫిర్యాదులు అందాయి.

## కాంగ్రెస్‌లో చేరిన ముథోల్ మాజీ ఎంఎల్ఎ విఠల్‌రెడ్డి



నిర్మల్ జిల్లా, ముథోల్ నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ విఠల్ రెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ముథోల్ నుంచి ఆయన 2014లో కాంగ్రెస్ తరఫున ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన టిఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన టిఆర్ఎస్ నుండి పోటీ చేసి మళ్లీ గెలుపొందారు. 2023లో పోటీ చేసిన ఆయన బిజెపి అభ్యర్థి రామారావు పటేల్ చేతిలో ఓడిపోయారు. రెండు మూడు నెలలుగా స్తబ్దుగా ఉన్న ఆయన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే గురువారం ఆయన సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు మరో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఖానాపూర్ ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు తదితరులు పాల్గొన్నారు. విఠల్ రెడ్డికి సిఎం రేవంత్ రెడ్డి ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విఠల్‌రెడ్డి తండ్రి గడ్డెన్న కాంగ్రెస్‌లో పలుమార్లు ఎంఎల్ఎగా, మంత్రిగా పనిచేశారు.

## పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి: జగదీష్ రెడ్డి



సూర్యాపేట: సాగునీరందక పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కోరారు. సూర్యాపేట మండలం రేఖ్యా తండా, దుబ్బ తండాలో ఎండిపోయిన పంట పొలాలను మాజీమంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం రైతులకు ఎస్సారెస్పీ పేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారన్నారు. రైతులకు స్పష్టమైన హామీ లభించిన తర్వాతే వేసిన పంటలకు నీరు ఇవ్వకుండా రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. ఒక్కో రైతు రూ.25వేల నుండి రూ.30 వేల పెట్టుబడి పెట్టి ఆగమయ్యారన్నారు. ప్రభుత్వం అవగాహన రాహిత్యం వల్ల రైతులు రోడ్డు మీద పడ్డారన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో కేసీఆర్ రైతాంగాన్ని సస్యశ్యామలం చేస్తే మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయ్యిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంట పొలాలు ఎండిపోతున్నప్పటికీ మంత్రులు కనీసం సమీక్ష చేయడం లేదన్నారు. పంట నష్టంపై మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# వరుస వరాలు ఓట్ల కోసమేనా....?

కేంద్రంలో మూడోసారీ అధికారం తమదేనని, 400 సీట్లు సాధిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ గత కొంత కాలంగా ఎంతో ధీమాగా చెప్తున్నారు. భారతీయ జనతా పార్టీకి చెందిన నేతలు కూడా చిలకపలుకుల్లా ఇదే మాటను వల్లె వేస్తున్నారు. ఇండియా కూటమి పేరుతో ప్రతిపక్షాలు ఏకమయినా తమకు పోటీయే కాదని కమలనాథులు ఢంకా బజాయించి చెబుతున్నారు. అయితే విచిత్రమేమిటంటే అంత ఆత్మ విశ్వాసం ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ గత కొన్ని నెలలుగా అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఎడాపెడా అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ వస్తున్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే కాదు, ప్రతిపక్షాలకు చెందిన రాష్ట్రాల్లోనూ వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరిస్తున్నారు. ఇవన్నీ కూడా తమ ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకోవడంతో పాటుగా ఇతర పక్షాల ఓటు బ్యాంకును కూడా కొల్లగొట్టడం కోసమేననేది రాజకీయ విశ్లేషకుల భావన. ఇది చాలదన్నట్లు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ దగ్గరపడే కొద్దీ మోడీ ఒక్కటొక్కటిగా తాయిలాలను బయటికి తీస్తున్నారు.కొద్ది రోజుల కింద ఉజ్వల స్కీమ్ కింద వంటగ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న రూ. 300 సబ్సిడీని మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే సబ్సిడీ లేని వంటగ్యాస్ సిలిండర్ ధరను 100 రూపాయలు తగ్గిస్తున్నట్లు ప్రకటించడం ద్వారా దేశంలోని కోట్లాది మంది గృహిణులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.ఇది చాలదన్నట్టుగా గురువారం మరో అడుగు ముందుకు వేసి పెట్రోలు, డీజిలు ధరలను లీటరుకు రూ.2 తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన ఒకటి, రెండు రోజుల్లో వెలువడవచ్చని వార్తలు వస్తున్న తరుణంలో ప్రధానికి ఒక్కసారిగా పెట్రోలు, డీజిలు ధరలు తగ్గించాలనే ఆలోచన రావడం విడ్డూరమే. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగి బ్యారెల్ 140 డాలర్లకు చేరువయిన తరుణంలో చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి పక్షం రోజులకోసారి వీటి ధరలు పెంచుతూనే వచ్చాయి. అలా పెరిగి పెరిగి కొండెక్కి కూచున్న ఇంధన ధరలు మళ్లీ దిగి వచ్చిన పాపాన పోలేదు. కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పుణ్యమా అని కంటి తుడుపుగా రూపాయో, రెండు రూపాయలో తగ్గించినా వాహనదారులకు పెద్దగా ఊరట లేదు. డీజిలు ధరలు పెరిగిన కారణంగా రవాణా చార్జీలు పెరిగి పోయి కూరగాయలు మొదలుకొని అన్ని నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నా, సామాన్యుడు విలవిలలాడుతున్నా మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా అనిపించలేదు. ఒకవేళ మీడియా సమావేశాల్లో ఈ విషయమై సంబంధిత మంత్రిని విలేకరులు అడిగితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిస్థితుల ఆధారంగా వీటి ధరలు ఉంటాయంటూ తెలివిగా తప్పించుకునేవారు. మోడీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని తేలిపోయింది గనుక ఇక ఇంధన ధరల గురించి పట్టించుకోరని వినియోగదారులు సైతం సర్దుకుపోవడం మొదలు పెట్టారు. ఇదే అదనుగా ఇప్పుడు వీటి ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించి ఒక్కసారిగా వారి దృష్టిలో అడగకుండానే వరాలిచ్చే దేవుడిలా మారిపోవాలని అనుకున్నట్లుగా కనిపిస్తోంది. అందుకే 2019లోనే పార్లమెంటు ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను అసోం, పశ్చిమ బెంగాల్ లాంటి ఈశాన్య రాష్ట్రాల్లో వ్యతిరేకత కారణంగా అమలు చేయకుండా తెరవెనక్కి నెట్టేసిన మోడీ సర్కార్ ఒక్కసారిగా ఎన్నికల సమయంలో మళ్లీ తెరముందుకు తీసుకు వచ్చింది. అంతేకాదు ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే దీని అమలుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ఆరు నూరయినా దీన్ని అమలు చేసి తీరుతామని రెండు రోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుండబద్దలు కొట్టి చెప్పడం చూస్తే దీని అమలు వల్ల ఎదురయ్యే వ్యతిరేకతకన్నా కూడా వచ్చే ఓటు బ్యాంకే ఎక్కువ అని మోడీ సర్కార్ గట్టి లెక్కలు వేసుకుని మరీ దీని అమలుకు నడుం బిగించిందని అర్థమవుతోంది. అయితే మోడీ ప్రకటించిన తాయిలాల అమలు భారం లక్ష కోట్ల మేరకు ఉంటుందని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయి. వీటి కారణంగా ఇప్పటికే అంచనాలను మించిపోయిన బడ్జెట్ లోటు మరింతగా పెరిగిపోతుందని వారు అంటున్నారు. వీటికి తోడు పరిశ్రమలు, రైతులు ఇలా వివిధ వర్గాలకు ప్రకటించిన పన్ను రాయితీలు, సబ్సిడీలు అన్నీ కలిపితే తడిసి మోపెడంత అవుతాయి. ఎన్నికల తాయిలాలు దేశానికి మంచిది కాదని సుభాషితాలు చెప్పే ప్రధాని మోడీ తన విషయానికి వచ్చేసరికి మాత్రం దాన్ని మరిచిపోవడం ఏమిటని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అరణ్య రోదనే అవుతున్నాయి. ఇది చాలదన్నట్లు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ దగ్గరపడే కొద్దీ మోడీ ఒక్కటొక్కటిగా తాయిలాలను బయటికి తీస్తున్నారు.కొద్ది రోజుల కింద ఉజ్వల స్కీమ్ కింద వంటగ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న రూ. 300 సబ్సిడీని మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.

## తమిళనాడు గవర్నర్‌పై...

# సుప్రీం తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్రవిపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డిఎంకె ఎమ్మెల్యే కె పొన్ముడికి దిగువ కోర్టు విధించిన శిక్షను తాము నిలిపివేసినప్పటికీ ఆయనను తిరిగి మంత్రిగా చేర్చుకోవాలన్న తమిళనాడు క్యాబినెట్ సిఫార్సును గవర్నర్ నిరాకరించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గవర్నర్ ఆర్ఎన్ రవి చర్యను సవాలు చేస్తూ ఎంకె స్టాలిన్ సారథ్యంలోని డిఎంకె ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన సిజెఐ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గవర్నర్ రవి చర్యపై మండిపడింది.
ఈ కేసులో గవర్నర్ ప్రవర్తన గురించి తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నామని సిజెఐ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునే ఆయన(గవర్నర్) ధిక్కరిస్తున్నారు అంటూ సిజెఐ ఆగ్రహించారు. మీరేం చేస్తున్నారు? పొన్ముడికి విధించిన శిక్షను సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఆయన ఎందుకు మంత్రిగా ప్రమాణం చేయకూడదు? మీ గవర్నర్‌కు చెప్పండి. లేనిపక్షంలో మేగు దీన్ని తీవ్రంగా పరిగణించాల్సి వస్తుంది అంటూ సిజెఐ గవర్నర్ తరఫు న్యాయవాదిని సిజెఐ హెచ్చరించారు.
తమిళనాడు ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి రాష్ట్రంలో సమాంతర ప్రభుత్వం నడపడానికి గవర్నర్ ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రతి నిర్ణయానికి తాము సుప్రీంకోర్టుకు రావలసి వస్తోందని సింఘ్వి తెలిపారు. తాము ఎందుకు ప్రతిసారి ఇలా రావాలని, ఇటువంటి చర్యలకు గవర్నర్ ఎందుకు పాల్పడుతున్నారని ఆయన ప్రశ్నించారు. పొన్ముడిని మంత్రిగా ప్రమాణం చేయించడానికి శుక్రవారం(మార్చి 22) వరకు గవర్నర్‌కు సిజెఐ చంద్రచూడ్ గడువు విధించారు. పొన్ముడిపై ఆయనకు(గవర్నర్) ఎటువంటి అభిప్రాయాలైనా ఉండవచ్చు కాని రాజ్యాంగం ప్రకారం నడుచుకోవలసిందేనని సిజెఐ పేర్కొన్నారు. శుక్రవారం వరకు మీకు సమయం ఇస్తున్నామని, లేనిపక్షంలో శుక్రవారం తమ తీర్పును వెలువరిస్తామని సిజెఐ తెలిపారు. కాగా..ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న కేసులో ప్రత్యేక కోర్టు డిఎంకె ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొన్ముడికి మూడే ళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పునుసస్పెండ్ చేస్తూ మార్చి 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే రాష్ట్ర క్యాబినెట్‌లోకి పొన్ముడిని తిరిగి తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గవర్నర్ రవి వ్యతిరేకించారు. ఆయనను మంత్రిగా నియమించడం రాజ్యాంగ నైతికతకు విరుద్ధమంటూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకించారు. దీనిపై డిఎంకె ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో కూడా అనేక బిల్లును ఆమోదించడంలో గవర్నర్ చేస్తున్న జాప్యాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## 'రజాకార్' సినిమా నిర్మాతకు బెదిరింపు కాల్స్



హైదరాబాద్ : నిజాం హయాంలో హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన దారుణ ఘటనల ఆధారంగా చరిత్ర కెక్కిన రజాకార్ సినిమా నిర్మాత గూడురు నారాయణ రెడ్డికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయి. తనకు దాదాపు 1100 వరకు బెదిరింపు కాల్స్ వచ్చా యని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత తనకు వచ్చిన బెదిరింపుకాల్స్‌కు సంబంధించి కేంద్ర హెూంశాఖకు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను కల్పించింది. 1o1 సిఆర్‌పిఎఫ్ జవాన్లను భద్రత నిమిత్తం కేటాయించింది. నిఘా వర్గాల ద్వారా దర్యాప్తు చేసిన అనంతరం కేంద్రం భద్రతను కల్పించింది. కాగా, గూడురు నారాయణ రెడ్డి నిర్మాతగా, యాటా సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'రజాకార్' సినిమా పాజిటివ్ టాక్‌ను తెచ్చుకుంది. ఈ సినిమాలో ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ కీలక పాత్ర పోషించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ సినిమా విడుదల కావాల్సింది. కొన్ని కారణాల వల్ల అప్పుడు విడుదల కాలేదు. ఇటీవల ఈ సినిమాను విడుదల చేశారు.

## కేంద్రానికి షాకిచ్చిన ఇసి..

### -ఇక నుంచి వాట్సాప్‌లో ఆ మెసేజ్‌లు పంపొద్దు




న్యూఢిల్లీ : మొబైల్ యూజర్లకు ఇప్పటికీ వికసిత్ భారత్ పేరుతో వాట్సాప్‌లో మెసేజ్‌లు వస్తున్నాయి. అది ఎన్నికల నిబంధనలకు విరుద్ధం అని కేంద్ర ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు వచ్చాయి. దాంతో ఈసీ చర్యలకు ఉపక్రమించింది. వాట్సాప్‌లో వికసిత్ భారత్ పేరుతో మెసేజ్‌లను తక్షణమే ఆపాలని గురువారం ఐటీ మంత్రిత్వశాఖకు ఆదేశాలు జారీ చేసింది. పారదర్శకతను నిర్ధారించేందుకు తాము తీసుకుంటున్న చర్యలో ఇదో భాగమని ఎన్నికల సంఘం పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కొద్ది గంటల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుందనగా, ప్రధాని మోడీ లేఖతో ఉన్న వాట్సాప్ సందేశాలను కేంద్రం పంపింది. 'వికసిత్ భారత్ సంపర్క్' పేరిట అవి వస్తున్నాయి. నెట్‌వర్క్ పరిమితుల కారణంగా మార్చి 16 న పంపిన సందేశాలు కొందరికి ఆలస్యంగా డెలివరీ అవుతున్నాయని ఈసీకి ఐటీ శాఖ వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసే మెసేజ్‌లు వస్తున్నాయని ఈసీకి ఫిర్యాదులు అందాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ క్రమం లోనే ఈసీ నుంచి తాజా స్పందన వచ్చింది.

## దేశ గౌరవం పెరగాలంటే ప్రధాని మోడీ మళ్లీ గెలవాలి

- ఆయనతోనే భారత్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు
- మేక్ ఇన్ ఇండియాతో చైనా ఉత్పత్తులకు చెక్ పడింది
- భారత్ ఎదుగుదలపై చైనా, పాకిస్తాన్‌లు కుట్రలు
- అంతర్జాతీయ స్థాయిలో అనేక శక్తులు మోడీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాయి
- వాటిని ఓడించాలంటే ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ : ప్రపంచస్థాయిలో భారత్ గౌరవం మరింత పెరగాలంటే ప్రధానిగా మోడీ మళ్లీ గెలవాలని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గత 10 సంవత్సరాల్లో మోడీ పాలనతోనే దేశానికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చిందన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో చైనా ఉత్పత్తులకు చెక్ పడిందని, ఇప్పుడు ఆ దేశం పాకిస్తాన్ తో కలిసి బిజెపి గెలవకుండా కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక శక్తులు మోడీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గురువారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో బస్తీ పర్యటన చేశారు. అనంతరం సీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నాలుగు పార్టీలతో దేశంలో ఎన్డీయే కూటమి ఏర్పడిందని, ఇటీవల తమిళనాడులో ప్రాంతీయ పార్టీలను కలిసి మాట్లాడి ఎన్డీయే కూటమిలోకి ఆహ్వానించినట్లు తెలిపారు.



వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, అమెరికా లాంటి అగ్రదేశాలు కూడా కష్టం వచ్చినప్పుడు మోడీని సంప్రదిస్తున్నాయన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మోదీని కలిసి రష్యా %--% -ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఏదో రకంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచానికి ఒక నాయకుడిగా, దేశానికి ప్రధాని నరేంద్రమోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని, గతంలో ఎక్కడా కూడా కనిపించని దేశం మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలను శాసించే స్థాయిలో ఉందని పాక్, చైనా దేశాలు సహించలేకపోతున్నాయన్నారు. మేక్ ఇన్ ఇండియాతో చైనా వెనకబడిపోయిందన్నారు. ఆ కారణంగా చైనా దేశం భారత్ మీద కక్ష గట్టి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించాలని కుట్రలు చేస్తోందన్నారు.

**మొదటిసారి దేశంలో మార్పు కనిపిస్తోంది:**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ నాయకత్వంలో మొదటిసారి దేశంలో మార్పు కనిపిస్తోందని తెలిపారు. దేశ అభివృద్ధి, దేశ గౌరవాన్ని వ్యతిరేకించే శక్తుల ఓట్లు ఎక్కువ పోలయ్యే అవకాశం లేకపోలేదన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు దేశం కోసం, అభివృద్ధి కోసం, దేశ గౌరవం కోసం, ఆధ్యాత్మికం కోసం పోలింగ్ లో పాల్గొనాలని, అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ ఆలయం, రాష్ట్రంలో కూడా అనేక దేవాలయాలను అభివృద్ధి చేసుకుంటున్నాయని తెలిపారు. పేదవారి సంక్షేమం కోసం నరేంద్రమోడీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోందని, పేదవారి ఇంట్లో టాయిలెట్ల నిర్మాణం నుంచి మొదలు చంద్రయాన్-3 వరకు అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. త్రిపుల్ తలాక్ రద్దు చేసి దేశంలోని10 కోట్ల ముస్లిం మహిళలకు విముక్తి కల్పించిదన్నారు. హైదరాబాద్ నుంచి 4 వందే భారత్ రైళ్లను కల్పించారని, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి రైల్వే స్టేషన్లను ఆధునీకరణ చేస్తున్నాయని, కేంద్రప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి మా పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రస్తుతం దేశంలో బిజెపికి 302 స్థానాలు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు మహేందర్ యాదవ్



**శామీర్ పేట, (గరుడ వార్త) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నాయకుడు మహేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నగరంలో మల్కాజ్గిరి సెగ్మెంట్ ఎంపీ ఎలక్షన్లపై జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శామీర్ పేట కు చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు మహేందర్ యాదవ్ కలిశారు.

## పిల్లలకు బాలామృతం ఒక అద్భుతమైన వరం




**శామీర్ పేట,(గరుడ వార్త) :** అంగన్వాడి చిన్నారులకు బాలామృతం ఒక అద్భుతమైన వరమని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేటలోని నాల్గవ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలకు ఐసిడిఎస్ పిడి అన్నప్రాసన చేసి పిల్లలకు బాలామృత ఆహారాన్ని తినిపించారు. అలాగే తల్లులకు ఎంతో ఆనందోత్సవాలతో శ్రీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకే ప్రభుత్వం అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ పౌష్టికాహారాన్ని తల్లులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు పద్మమ్మ, రేణుక, అంగన్వాడి టీచర్లు నిర్మల, శకుంతల, పావని, భవాని తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



శామీర్ పేట, (గరుడ వార్త) : మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం శామీర్ పేట మండలం లాల్ గడిమలకపేట లో మెగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 132 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయగా, ఆపరేషన్ అవసరము ఉన్న 33 మందిని రెఫర్ చేశారు. వీరిని మెడిసిటీ ఆసుపత్రికి తరలించి ఉచిత ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఒమార్, అభిషేక్ , వైభవి , దివ్య, సమ్రాన్, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, పూజ, గ్రామ బిల్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కారోబార్ రంజిత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లో ప్రజాస్వామ్యం ఉందనేది వట్టిమాట: రాహుల్ గాంధీ



హైదరాబాద్: బ్యాంకు ఖాతా ఫ్రీజ్ ఏం జరుగుతుందో అందరికీ తెలుసునని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో రాహుల్ ప్రసంగించారు. ఈ రోజుల్లో బ్యాంకు ఖాతా స్తంభిస్తే అంతా ఆగిపోతుందని, కాంగ్రెస్ ఖాతాను ఫ్రీజ్ చేసి దెబ్బతీస్తున్నారని దుయ్యబట్టారు. బ్యాంక్ ఖాతా ఫ్రీజ్ కారణంగా తాము ఏమీ చేయలేకపోతున్నామని, సరిగ్గా పార్లమెంట్ ఎన్నకలకు రెండు నెలల ముందు ఇలా చేయడం దారుణమైన విషయమని స్పష్టం చేశారు. విపక్ష బ్యాంకు ఖాతా ఫ్రీజ్‌పై ఫిర్యాదు చేసినా ఇసి స్పందించడంలేదని, కాంగ్రెస్ ఖాతాను ప్రధాని నరేంద్ర మోడీ నేరపూరితంగా ఫ్రీజ్ చేశారని ధ్వజమెత్తారు. ఈ చర్యతో భారత్‌లో ప్రజాస్వామ్యం అబద్ధమైపోయిందని, నెల క్రితమే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలన్నీ ఫ్రీజ్ చేశారని రాహుల్ మండిపడ్డారు. దేశంలో ఇంత దారుణం జరుగుతుంటే అంతా చోద్యం చూస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల వేళ తాము కనీసం పోస్టర్లు కూడా వేసుకోలేకపోతున్నామని రాహుల్ వివరించారు. ప్రస్తుతం భారత్‌లో ప్రజాస్వామ్యం ఉందనేది వట్టిమాట అని బిజెపి రాజకీయాలను ఉద్దేశించి చురకలంటించారు.

# సుప్రీంకు పతంజలి క్షమాపణ



న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలియజేసింది. ధిక్కార పిటిషన్‌పై సమాధానం ఇవ్వకపోవడంతో రెండు రోజుల క్రితం అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన రామ్‌దేవ్ బాబా, మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణకు సమన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమం లోనే తాజా స్పందన వచ్చింది. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గత ఏడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ 'అసత్య, తప్పుదోవ ' పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని సూచించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరఫున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. కానీ ఆ హామీని ఉల్లంఘించడంపై గత నెల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ రామ్‌దేవ్ బాబాకు, ఆచార్య బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ప్రకటనల విషయం లోనూ సూచనలు చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఎలాంటి ప్రచారం చేయొద్దని మరోసారి సూచించింది. ఆ నోటీసులకు పతంజలి సమాధానం ఇవ్వడంలో విఫలమైంది. 'మీ ప్రతిస్పందన ఎందుకు దాఖలు చేయలేదు ?' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరు కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పతంజలి సంస్థ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. న్యాయవ్యవస్థ పట్ల అత్యంత గౌరవం ఉందని బాలకృష్ణ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆ తరహా ప్రకటనలు జారీ చేయకుండా చూసుకుంటామని చెప్పారు. ఈ ఉత్పత్తుల వాడకం ద్వారా ప్రజలు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని గడపాలన్నదే తమ సంస్థ ఉద్దేశమని పేర్కొన్నారు.

## కేజ్రీ ఇంట్లో ఈడీ తనిఖీలను ఖండించిన పంజాబ్ సీఎం

మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల తనిఖీలను పంజాబ్ సీఎం భగవత్ సింగ్ మాన్ గురువారం ఖండించారు. కేజ్రీవాల్ ను అరెస్ట్ చేయడానికే ఆయన ఇంటిలో తనిఖీలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేజ్రీవాల్ ను అరెస్ట్ చేయడానికి ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆప్ నేతలు ఆరోపించారు. మరోవైపు, కేసు దర్యాప్తు పురోగతిలో ఉన్నందున అరెస్ట్ చేయకుండా నివారించలేమని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆప్ నేతలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మనీ లాండరింగ్ చట్టంలోని 50 సెక్షన్ ప్రకారం కేజ్రీవాల్ ను విచారిస్తున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

## తెల్లవారుజామునే యోగా..ఆపై ఈ ఆహారం తీసుకుంటా : ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్



న్యూఢిల్లీ: సంపూర్ణ జీవనశైలితో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రోజంతా ఉత్తేజంగా, సానుకూల శక్తితో ఉరకలు వేయవచ్చని ప్రపంచవ్యాప్తంగా నిపుణులు నిత్యం చెబుతుంటారు. సంపూర్ణ జీవనశైలిని అనుసరించడం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఆసక్తి కనబరుస్తుంటారు. ఆయన ఇటీవల ఓ వార్తఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన దైనందిన జీవితం, ఆహార నియమాలు, చీట్ మీల్స్ సహా పలు అంశాలను వెల్లడించారు. తన దినచర్య ప్రతిరోజూ తెల్లవారుజామున 3.30 గంటలకు యోగాతో ఆరంభమవుతుందని చెప్పారు. ఆపై ఆయుర్వేద ఆహార పద్ధతులను అనుసరిస్తానని తెలిపారు. ఇక ఆహార ప్రాధాన్యతల విషయానికి వస్తే తాను, తన భార్య శాకాహారం తీసుకుంటామని వివరించారు. మనం నాలికకు ఏం అందిస్తామనేది మన శరీరం, మనసును నిర్దేశిస్తుందని తాను నమ్ముతానని, అందుకే మొక్కల ఆధారిత ఆహారం, జీవనశైలి తనకు సరిపడుతుందని చెప్పారు. ప్రతి మరాఠీ కుటుంబం కిచెన్‌లో సగ్గుబియ్యం తప్పనిసరిగా ఉంటుంది. అయితే తాను సగ్గుబియ్యానికి బదులు రాజ్‌గిరాను తీసుకోవడానికి ఇష్టపడతానని తెలిపారు. ఇది తేలికగా ఉండటంతో పాటు ఆరోగ్యకరమైన తృణధాన్యాల్లో ఒకటని చెప్పారు. అయితే తాను అడపాదడపా ఐస్‌క్రీం విషయంలో రాజీపడుతుంటానని తెలిపారు. మీరు మీ మనసును అదుపులో ఉంచుకుంటే అంతా సజావుగా ఉంటుందని ముగించారు.

# మనుగడకే గురిపెడుతున్న మానసిక యుద్ధం




ఊదరగొట్టుట అనే ప్రాపగాండాకు అనుబంధ ఫలితాలు అనే సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయి. జనంలో భయభక్తులను పెంచుకోవడానికి నాయకుడు ఇంద్రుడు చంద్రుడు వీరుడు శూరుడు అని ప్రచారం చేస్తారు. అట్లా చేయగా చేయగా, నిజమే కాబోలు అని ప్రతినాయకుడు అనుకుంటాడు, అంతేకాదు, నిజంగా తాను అరివీర భయంకరుణ్ణేమో అని ప్రచార నాయకుడు కూడా నమ్మడం మొదలుపెడతాడు. ఇతరుల మీద కమ్మే మాయపొర ఎంతో కొంత తమని కూడా మత్తులో ముంచుతుంది. నరేంద్రమోదీ, ఆయన పార్టీ వారు సామాన్యులు కాదు. ఉత్సాహం, వ్యూహం, ముందుజాగ్రత్త అన్నీ తగుపాళ్లలో ఉన్న మేధాబృందం వారికి ఉన్నది. తమ లక్ష్యసాధన గురించి జాగరూకత ఎంత ఉన్నప్పటికీ, రేపు కూడా తమదే అధికారం, పరమాధికారం అన్న బేఖాతరుదర్పం కూడా వారిలో తరచు పొడుచుకు వస్తోంది. పొగరుగా కనిపించే ఆ ధీమా కూడా వారి చేతిలో ఒక రాజకీయ పాచికే! మొన్న ఆదివారం నాడు కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సాధారణ ఎన్నికలకు ముందు అదే చివరి సమావేశం. మంత్రులు ఎన్నికల ప్రచారాల్లో ఎట్లా ఉండాలి, ఏమేమి జనాలకు చెప్పాలి వంటి సుద్దులు ప్రధానమంత్రి తన సహచరులకు చెప్పారు. అది సరే. మరోసారి అధికారంలోకి వచ్చాక మొదటి వందరోజుల కాలంలో ఏమి చేయాలో మోదీ చర్చించారట. తన ప్రభుత్వమే వస్తుందని, తాను ప్రధాని అవుతానని అనుకోవడం ఓకే. సంభావ్యత అధికంగా ఉన్న విషయం అది. కానీ, ఈ మంత్రివర్గమే ఉండకపోవచ్చు కదా? అయినా, ప్రస్తుతం ఇంత హడావిడి నడుస్తుండగా, నూతన ప్రభుత్వమూ నూరురోజులూ అన్న మేధోమథన కార్యక్రమం ఎందుకు?

వికసిత భారతాన్ని సాధించాలనే లక్ష్యం ప్రధానమంత్రిని ఆత్రుత పెడుతోంది అనుకుందాం, అందుకు సమయం సందర్భం చూసుకోనక్కరలేదా? నిజంగా, ఆ అంశం గురించి చర్చించడంలో పెద్ద విశేషం ఏమీ లేదు. అట్లా చర్చించినట్టు బయటకు చెప్పుకోవడంలోనే అసలు కిటుకు ఉన్నది. విశ్వసనీయవర్గాల ద్వారా బయటకు పొక్కిన ఆ రహస్యం ద్వారా ప్రతిపక్షాలు ఏమి అనుకోవాలంటే, మోదీ గారు గెలవడమే కాదు, మరో హయాం పాలన కూడా ఆరంభించారు, భవిష్యత్తు వర్తమానంలోకి చొచ్చుకు వచ్చేసింది, అని. ఇక ప్రజలు ఏమి అనుకోవాలంటే, చూశారా, మోదీ ఎప్పుడూ దేశ వికాసం కోసమే ఆలోచిస్తారు, ఆయన ప్రత్యర్థులే రాజకీయాలు చేస్తున్నారు, అని. ప్రతిపక్షాల మీద మానసికయుద్ధంలో మోదీ బ్రహ్మాస్త్ర ప్రయోగం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే మొదలయింది. సాధారణంగా, ఇటువంటి బడ్జెట్‌లు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతాయి. చాలాసార్లు, ప్రభుత్వాలకు తామే మళ్లీ గెలుస్తామన్న నమ్మకం నూటికి నూరుపాళ్లు ఉండదు. అందుకని, ఎన్నికల ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో యథేచ్ఛగా వరాలు, వాగ్దానాలు గుప్పిస్తారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే అవన్నీ అమలుచేస్తామన్న వాగ్దానం ఆ బడ్జెట్ ఇస్తుంది. కానీ, మోదీ ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఏ మాత్రం 'జనాకర్షణ' లేని విధంగా రూపొందించింది. తామే తిరిగి అధికారంలోకి వస్తామని అనుకుంటున్నారు కాబట్టి, అమలు చేయగలమా లేదా అన్న విచికిత్స వారి మీద పనిచేసింది. ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది. తెలంగాణలో కూడా అదే మానసిక యుద్ధతంత్రం నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ అంతరించిపోతుందని బీజేపీ అంటుంది. ఆరునెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ అంటుంది. బీజేపీ బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని అసెంబ్లీ ఎన్నికల నాటి పాతపాటే కాంగ్రెస్ పాడుతుంది. ఎన్నికల ప్రచారానికి ఏవో వివాదాంశాలు అవసరం అవుతాయి. కానీ, తెలంగాణలో ఉన్న ప్రస్తుత వాతావరణం, ప్రభుత్వాల, పార్టీల మనుగడలనే చర్చలోకి తెచ్చింది. జాతీయ రాజకీయ సమరంలో తలపడుతున్న రెండు జాతీయపార్టీలు, మొన్నటిదాకా పదేళ్లు అధికారంలో, మరో పదమూడేళ్లు ఉద్యమంలో ఉన్న ప్రాంతీయపార్టీ, తమ తమ శక్తియుక్తులన్నిటిని ఉపయోగించి, ఎన్నికల గండాన్ని దాటడానికి ప్రయత్నిస్తున్నాయి. నిజానికి, ఈ ఎన్నికలు బీజేపీకి గండం కావు. ఈ ఎన్నికల ఫలితాల వల్ల కొత్తగా ఏ నష్టమూ పొందనిది బీజేపీ ఒక్కటే. ప్రస్తుతం ఉన్న స్థానాలను నిలుపుకున్నా చాలు. కాంగ్రెస్ అనుకూలత నేపథ్యంలో కూడా తన బలాన్ని కాపాడుకున్నట్టు అవుతుంది. అదనంగా స్థానాలు గెలుచుకుంటే, పురోగమిస్తున్నట్టు లెక్క. సగానికి పైగా గెలిస్తే, ఆపైన తిరుగుండదు. ఉన్న సీట్లకు తగ్గితే కూడా, అర్థం చేసుకోదగ్గ పరిణామమే తప్ప, పెద్ద పతనం కాదు. కాబట్టి, బీజేపీ ఒక సౌకర్యవంతమైన స్థితినుంచి పోరాటంలోకి దిగుతోంది. దాని ప్రయత్నం అంతా మెరుగుదల కోసమే. ఆ మెరుగుదల వస్తే, రాష్ట్ర రాజకీయాలను కూడా మలుపుతిప్పగలిగిన పరిణామాలకు అవకాశం ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిస్థితి అట్లా లేదు. వాటికి జీవన్మరణ సమస్య. అసెంబ్లీ విజయానికి తగినట్టు, అంతకు మించి విజయాలు రాకపోతే, రేవంత్ రెడ్డికి అధిష్ఠానం దగ్గర రేటింగ్ తగ్గవచ్చు, లేదా, ఇంటిపోరు అధికం కావచ్చు. తమకు మంచి గెలుపు రావడం ఒక్కటే సరిపోదు, బీఆర్ఎస్‌కు అనూహ్యమైన విజయాలు ఏమీ రావు కానీ, బీజేపీకి అదనపు బలం సమకూరకూడదు. కాంగ్రెస్ పది గెలిచి, తక్కినవి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం దక్కించుకుంటే ఓకె. అట్లా కాకపోతే, అదనపు గెలుపులతో బీజేపీలోకి వలసలు పెరిగిపోతాయి. కొందరు నిబద్ధులు ఉన్న మాట నిజమే కానీ, బీఆర్ఎస్ శా??సన?సభ్యులు అనేకులు తమకు ఉన్నచోట భవిష్యత్తు లేదన్న చింతలో పడిపోయారు. వారికి సహజంగానే బీజేపీ ఒక ఆకర్షణీయ గమ్యంగా కనిపిస్తుంది. ఇక అప్పుడు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు అనుమతించాలన్న తాత్విక ప్రశ్న బీజేపీ ఢిల్లీ పెద్దలలో తలెత్తవచ్చు. బీఆర్ఎస్‌ది ప్రస్తుతానికి దయనీయ పరిస్థితే. లోక్‌సభ ఎన్నికలలో ప్రచారాంశమే లేని పార్టీ ఇది. కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి అయినా, బీజేపీకి వేయడానికి అయినా ఓటరుకు తగిన కారణాలున్నాయి. మరి బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీకి పోయి ఏమి సాధిస్తారు? అట్లాగని, ఎన్నికలను వదులుకోలేరు. మొన్నటి ఎన్నికలలో బలం చూపిన చోట్ల అయినా, ఎంపీలను గెలిపించుకోవాలి. లేకపోతే, ఎమ్మెల్యేల బలగాన్ని నిలుపుకోవడం కష్టం. కానీ, గత పదేళ్ల దాని పరిపాలనా కాలాన్నే కాంగ్రెస్ వివాదాస్పదం చేస్తున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల కాలం ఎడారిలాగా కనబడుతుంటే, పార్టీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి కూడా బీఆర్ఎస్ వేట ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

# రిజిస్ట్రేషన్ల శాఖలో అక్రమాల పర్వం...!




**రాంనగర్ :** ఉమ్మడి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో అక్రమాల పర్వం కొనసాగుతోందని, భూములు, ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన ప్రక్రియలో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్తుల రేట్ల ఆధారంగా వసూళ్ల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయాల్లో పని జరగాలంటే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని, నేరుగా వెళితే పనులు జరుగవని ప్రజలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని మరీ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు మరో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతీ కార్యాలయ పరిధిలో పదుల సంఖ్యలో డాక్యుమెంట్ రైటర్స్ ఉంటారు. ప్రతీ కార్యాలయంలో ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్స్ ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి. కొందరు డాక్యుమెంట్ రైటర్లు అధికారులకు సన్నిహితంగా ఉంటూ క్రయవిక్రయాల్లో కీలకపాత్ర పోషించి పెద్దఎత్తున కూడబెట్టుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల్లో 2వేల మందికిపైగా డాక్యుమెంట్ రైటర్స్ ఉండగా, హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 250మందికి పైగా ఉంటారు. కొందరు రైటర్స్ ఆస్తుల విలువ ప్రకారం క్రయవిక్రయదారులతో బేరసారాలు నడిపి అధికారులతో పని కానిచ్చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో ఫీజు టూ ఫీజు పేరిట వసూళ్లు చేస్తుంటారని, అధికారులు తమవద్దకు వచ్చిన ప్రతీ డాక్యుమెంట్‌ను పరిశీలించి అది ఏ రైటర్ నుంచి వచ్చిందో నోట్ చేసుకుని సాయంత్రం వసూళ్లు చేస్తారని సమాచారం. వారు ప్రత్యేకంగా నియమించుకున్న ప్రైవేటు వ్యక్తి సాయంత్రం డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లి ఆయన పరిధిలో చేసిన డాక్యుమెంట్ల సంఖ్య ఆధారంగా వసూలు చేస్తాడని తెలిసింది. ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.2వేల చొప్పున, ఏదైనా సమస్య ఉంటే అదనంగా తీసుకుంటారన్నది బహిరంగ సత్యమేనన్న అభిప్రాయాలున్నాయి. ఇక నగరం పరిధిలోని కార్యాలయాల్లో అయితే ఈ వసూళ్లు లక్షల్లో ఉంటాయనే ప్రచారం ఉంది. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లయితే అత్యాశతో అధికారులను ప్రలోభాలకు గురిచేసి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి పట్టుబడిన సంఘటనలున్నాయి. వరంగల్‌లోని ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక డాక్యుమెంట్ రైటర్ సంబంధిత కార్యాలయ అధికారులకు ముడుపులు చెల్లించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసి బలైన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో అధికారులు సస్పెండ్ కాగా, సదరు డాక్యుమెంట్ రైటర్ జైలుకు వెళ్లారు. కొద్ది నెలల కిందట జరిగిన ఈ సంఘటన ఆ శాఖలో ప్రకంపనలు సృష్టించింది. ఇదిలాఉంటే కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు విచ్చలవిడిగా సంపాదించి ప్రజాప్రతినిధులకు సన్నిహితంగా ఉంటూ అధికారులపై పెత్తనం చేసే స్థాయికి చేరుకున్నారంటే వారి హవా ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి స్లాట్ బుక్ చేసుకున్నవారికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన పెట్టింది ప్రభుత్వం. క్రయవిక్రయదారులు ముందస్తుగా స్లాట్‌బుక్ చేసుకుంటే తేదీ, సమయం వస్తుంది.

# ప్రోత్సాహకమేదీ?




**నర్మెట :** పత్తి సాగులో అధిక దిగుబడులను సాధించడంతో పాటు రైతులకు ఎక్కువ లాభాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలని సూచించింది. సాధారణ పత్తి సాగులో తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్నారని భావించి 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. పత్తి సాగులో అధిక దిగుబడులను సాధించడంతో పాటు రైతులకు ఎక్కువ లాభాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలని సూచించింది. సాధారణ పత్తి సాగులో తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్నారని భావించి 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. అంతే గాకుండా ఈ పద్ధతిలో సాగు చేస్తే ప్రోత్సాహక నగదును కూడా అందిస్తామని ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో రైతులు అదే పద్ధతిలో పత్తి సాగు చేశారు కాని, ఇచ్చిన మాటను ఆచరణలో పెట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. సదరు రైతులకు ఇప్పటివరకు ప్రోత్సాహక నగదును అందించలేదు. పంట సాగు పూర్తై రెండేళ్లయినా ప్రోత్సాహకం అందకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నర్మెట మండలంలో మూడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయించారు. బొమ్మకూరు, హన్మంతాపూర్, నర్మెట గ్రామాల్లో 14 మంది రైతులు 25 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాగు చేసి క్షేత్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై సూచనలు సైతం ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా పత్తి సాగు పూర్తయి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు ప్రోత్సాహకం అందలేదు. సదరు రైతుల బ్యాంకు ఖాతాలు, సాగు చేసిన భూమి వివరాలు ఇప్పటికే సేకరించి ప్రభుత్వానికి నివేదించినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అంతే గాకుండా ఈ పద్ధతిలో సాగు చేస్తే ప్రోత్సాహక నగదును కూడా అందిస్తామని ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో రైతులు అదే పద్ధతిలో పత్తి సాగు చేశారు కాని, ఇచ్చిన మాటను ఆచరణలో పెట్టడంలో ప్రభుత్వం విఫలమైంది.

# కళాప్రపూర్ణుడు నటరాజ రామకృష్ణ!



నాట్యాన్నే జీవిత సర్వస్వంగా చేసుకొని కళకే అంకితమై, బ్రహ్మచారిగానే ఉండిపోయి, ఆరు దశాబ్దాలుగా కళామతల్లికి విశేష సేవలందించి, ప్రాచీన సాంప్రదాయ నాట్య కళా రీతులను దశదిశలా వ్యాపింప జేసిన కళాదిగ్గజం రామకృష్ణ. కాకతీయుల కాలంలో కనుమరు గయిన తెలంగాణ నృత్య విశేషం 'పేరిణి' శివతాండవ నృత్యాన్ని పునరుజ్జీవింప చేసి, అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన నాట్యగురువు ఆయన. తెలుగు వారి ప్రాచీన నాట్యకళా రీతులకు తిరిగి జీవంపోసి... ఆరు దశాబ్దాలుగా నాట్య కళా రీతులను దేశ విదేశాలలో ప్రదర్శింప చేసిన మహా నాట్యాచార్యుడు, భరత కళాప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ నటరాజ రామకృష్ణ ఇండోనేషియా లోని బాలి ద్వీపంలో భారత్ నుంచి వెళ్ళిన కుటుంబంలో మార్చి 21, 1923న జన్మించారు. చిన్న వయస్సులోనే తల్లి మరణించగా, ఆ తర్వాత కుటుంబం భారతదేశానికి తిరిగి వచ్చింది. చిన్నవయస్సు నుంచే రామకృష్ణ సాంప్రదాయ నృత్యాలపై మక్కువ చూపించారు. ఆయన తనలోని కళాతృష్ణ అన్వేషణలో మీనాక్షి సుందరం పిళ్ళై, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, శ్రీమతి నాయుడుపేట రాజమ్మ, పెండెల సత్యభామ లాంటి మహామహులైన ఉద్దండ కళా గురువులను కలుసుకొని వారి నుండి ఎన్నో నాట్యరీతుల్ని నేర్చుకున్నారు. కాకతీయుల కాలం నాటి నృత్యం పేరిణి శివ తాండవంను రామకృష్ణ వెలుగు లోకి తెచ్చారు. నవ జనార్ధన పారిజాతం అనే నాట్య ప్రక్రియను సృష్టించారు. ఆంధ్రనాట్యం, పేరిణి నృత్యాల పురోగతికై 'నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం' సంస్థను నెలకొల్పారు. హైదరాబాదు లోని తారామతి, ప్రేమావతి మందిరాలను బాగు చేయించారు. భరతనాట్యం, కూచిపూడి లాంటి భారతీయ నృత్య సంప్రదాయాలను ఆకళింపు చేసుకొని తెలుగువారి సంస్కృతికి దర్పణమైన ఆంధ్ర నాట్యాన్ని పునరుద్ధరించి ప్రపంచ వ్యాప్తంగా బహుళ ప్రచారం చేసిన కళాకారుడిగా రామకృష్ణ పేరుపొందారు. దేవదాసీల నృత్య రీతులను నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం పేరుతో సుస్థితం చేశారు. 15 సం.ల వయస్సులోనే నాట్యగ్రంథాలు వ్రాయడం మొదలుపెట్టి మొత్తం 41 గ్రంథాలు పూర్తిచేశారు. ప్రధానంగా 10వ శతాబ్దంలోని కాకతీయ సామ్రాజ్య కాలంలో, మగవారు నాట్యం చేసే పేరిణి శివతాండవ నృత్యాన్ని పునర్జీవింప చేసి, ఎందరికో శిక్షణ ఇచ్చి, ప్రాచీన నాట్య కళను తిరిగి వందలాది ప్రదర్శనలు ఇప్పించి నాట్య కళకు ఎనలేని సేవలు అందించిన కళాతపస్వి రామకృష్ణ. వేంకటేశ్వర కల్యాణం, కుమార సంభవం, మేఘ సందేశం వంటి నాట్య ప్రదర్శనలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఉజ్జయినిలో ప్రదర్శింప బడిన కుమార సంభవానికి స్వర్ణకలశం లభించింది. తెలుగు వారి ప్రాచీన నాట్యకళా రీతులకు తిరిగి జీవంపోసి... ఆరు దశాబ్దాలుగా నాట్య కళా రీతులను దేశ విదేశాలలో ప్రదర్శింప చేసిన మహా నాట్యాచార్యుడు, భరత కళాప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ నటరాజ రామకృష్ణ ఇండోనేషియా లోని బాలి ద్వీపంలో భారత్ నుంచి వెళ్ళిన కుటుంబంలో మార్చి 21, 1923న జన్మించారు. నటరాజ రామకృష్ణ వ్రాసిన 40కి పైగా పుస్తకాలలో ఆరింటికి భారత ప్రభుత్వ పురస్కారం లభించింది. వాటిలో దాక్షిణాత్యుల నాట్యకళాచరిత్ర, ఆంధ్రులు– నాట్యకళారీతులు వంటివి ప్రసిద్ధ గ్రంథాలు. దక్షిణ భారత నృత్య రీతుల, నర్తన బాల, డ్యాన్సింగ్ బెల్స్ పుస్తకాలకు కేంద్ర, రాష్ట్ర పురస్కారాలు కూడా లభించాయి. డ్యాన్సింగ్ బెల్స్ ఇంగ్లీష్ రచన స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆయన సమ్మతితో అంకితమివ్వటం మధురమైన స్మృతిగా రామకృష్ణ భావించేవారు. 1979లో భారతకళా సవ్యసాచి బిరుదు పశ్చిమ గోదావరి జిల్లా కళాకారుల సంఘం ద్వారా పొందారు. కళాప్రపూర్ణ బిరుదు 1981లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి, కళాసరస్వతి బిరుదు 1982లో హైదరాబాదులోని కళావేదిక ద్వారా ఇవ్వబడ్డాయి. దక్షిణ భారతపు ఉత్తమ నాట్యాచార్యుడుగా 1984లో కేంద్ర సంగీత నాటక అకాడమీ ద్వారా ఇవ్వబడింది. 1986 లో ఎల్.వి.ఆర్. ట్రస్ట్, మద్రాసు నుండి %--% పేరిణీ శివతాండవంపై పరిశోధనకుగాను ఉత్తమ పరిశోధకునిగా పురస్కారం అందుకున్నారు. 1980 శ్రీశైలం దేవస్థానం తరపున ఆస్థాన నాట్యాచార్యునిగా ఉన్నారు. అలాగే 1980 సంవత్సరం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఆస్థాన నాట్యాచార్యునిగా వ్యవహరించారు. 1985 లో ఆంధ్రప్రదేశ్ కళాప్రేమికులు ఆయనకు స్వర్ణకిరీటాన్ని బహూకరించారు. 1991లో శ్రీ రాజాలక్ష్మీ పురస్కారం,95లో రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ అవార్డ్ మరియు భారత ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 1999లో కళాసాగర్ అవార్డ్ అందుకున్నారు. 2000 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం తరపున విశిష్ట పురస్కారం అందుకున్నారు. నాట్య కళకు అంతర్జాతీయఖ్యాతి తెచ్చిపెట్టిన రామకృష్ణ. జూన్ 7, 2011న హైదరాబాదులో మరణించారు.

# మహువా మొయిత్రాపై ఆరోపణలపై సిబిఐ దర్యాప్తుకు ఆదేశించిన లోక్‌పాల్....!



న్యూఢిల్లీ: టిఎంసి మాజీ లోక్‌సభ సభ్యురాలు మహువా మొయిత్రాపై ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణ చేపట్టనుంది. ఆరు నెలల్లోగా నివేదికను సమర్పించాల్సిందిగా లోక్‌పాల్ బుధవారం ఆదేశించింది. రికార్డులో ఉన్న మొత్తం మెటీరియల్‌ని జాగ్రత్తగా మూల్యాంకనం చేసి, పరిశీలించిన తర్వాత, ఆర్‌పిఎస్ (రెస్పాండెంట్ పబ్లిక్ సర్వెంట్)పై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి సందేహాలు లేవని లోక్‌పాల్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వాటికి తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఆమె ఉన్న పదవి దృష్ట్యా అవి చాలా తీవ్రమైనవని పేర్కొంది. దీంతో ఈ ఆరోపణలపై లోతైన దర్యాప్తు అవసరమని భావించి విచారణ చేపట్టాల్సిందిగా సిబిఐని ఆదేశించినట్లు లోక్‌పాల్ తెలిపింది. ఈ ఆర్డర్ అందుకున్న తేదీ నుండి ఆరు నెలల్లోపు నివేదికను సమర్పించాలని, ప్రతి నెలా దర్యాప్తు స్థితికి సంబంధించి రిపోర్టును అందించాల్సిందిగా సిబిఐని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాల్లో లోక్‌పాల్ ఫిర్యాదుదారుతో పాటు ఎవరి పేరును సూచించలేదు. మహువా మొయిత్రా ఆరోపణలపై గతేడాది నవంబర్ 8న లోక్‌పాల్ సిబిఐ దర్యాప్తుకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆరువారాల్లోగా నివేదికను సమర్పించాలని గడువు విధించింది. అయితే గడువు సమయాన్ని మూడు నెలలకు పొడిగించాల్సిందిగా సిబిఐ కోరింది. వాస్తవానికి ఈ గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 15తో ముగిసింది.

# కోవిడ్ టీకాపై బోల్సనారో తప్పుడు సమాచారం




బ్రసీలియా : కోవిడ్ మహమ్మారి వేళ టీకాల డేటాపై బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ బ్రెజిల్ ఫెడరల్ పోలీసులు అభిశంసించారు. ఆనాడు అధ్యక్షుడిగా వున్న బోల్సనారో, ఆయన 12 ఏళ్ళ కుమార్తె, ఆయన సన్నిహితుల్లో మరికొంతమంది కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నట్లు పబ్లిక్ హెల్త్ డేటాబేస్‌లో తప్పుడు సమాచారాన్ని వుంచారంటూ బోల్సనారోతో సహా మరో 16 మందిపై పోలీసు విభాగం తీవ్రంగా విమర్శలు చేసింది. ఇందుకు సంబంధించి పోలీసుల అభిశంసన పత్రాన్ని సుప్రీం కోర్టు మంగళవారం విడుదల చేసింది. కోవిడ్ వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా గళం వినిపించిన కొద్ది మంది నేతల్లో బోల్సనారో ఒకరు. ఆయన బాహటంగానే కోవిడ్ ఆంక్షలను ఉల్లంఘిస్తూ, ప్రజలు కూడా తనను అనుసరించాలని కోరారు. అయితే సుప్రీం కోర్టులో బోల్సనారోపై అభియోగాలు నమోదు చేయడానికి ఈ పోలీసుల అభిశంసన పత్రాన్ని ఉపయోగించవచ్చా లేదా అనే అంశంపై బ్రెజిల్ ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం తుది నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది. కాగా దీనిపై బోల్సనారో తరపు న్యాయవాది తక్షణమే స్పందించలేదు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా డసిల్వా తిరిగి ఎన్నికైన రెండు మాసాల తర్వాత 2022 డిసెంబరులో అమెరికాకు వెళ్ళిపోవడానికి కాస్త ముందుగా బోల్సనారో, ఆయన సహచరులు ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటాబేస్‌లో అక్రమాలకు పాల్పడ్డారని పోలీసులు ఆరోపించారు. ఆరోగ్య డేటాలో తప్పుడు సమాచారం చొప్పించినట్లు రుజువైతే బోల్సనారోకు 12ఏళ్ళ జైలు శిక్ష విధించే అవకాశం వుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# యుద్ధ తంత్రంగా ఆకలి మంటలు....!



**జెనీవా :** యుద్ధంతో ఛిద్రమవుతున్న గాజాలో మానవతా సాయం అందించేందుకు ఇజ్రాయెల్ ఆంక్షలు అడ్డంకిగా మారాయని ఐరాస తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే.. ఆకలి మంటల్ని ఆ దేశం యుద్ధతంత్రంగా వాడుతున్నట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. అదే గనుక నిజమైతే యుద్ధ నేరం కింద పరిగణించాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ జరిపిన ఉగ్ర దాడితో గాజాలో ఇజ్రాయెల్ ప్రతి దాడులు మొదలు పెట్టింది. అప్పటి నుంచి ఆ ప్రాంత పరిస్థితి దారుణంగా మారింది. స్థానికుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఇక్కడి జనాభాలో 70 శాతం మంది తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటున్నట్లు తాజాగా అంచనా వేసింది. స్థానికంగా ప్రతి ఒక్కరూ ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఉత్తర ప్రాంతంలో దాదాపు 2 లక్షల మంది విపత్కర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపింది. ఒకవేళ ఇజ్రాయెల్ తన దాడులను రఫాకు విస్తరిస్తే.. మొత్తం 23 లక్షల మంది జనాభాలో సగం మంది క్షుద్బాధకు లోనవుతారని హెచ్చరించింది. దాదాపు 13 లక్షల మంది పాలస్తీనీయులు ఆశ్రయం పొందుతున్న రఫా ప్రాంతాన్నీ ఇజ్రాయెల్ ఆక్రమించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులివ్వాలి



**న్యూఢిల్లీ :** 8 కోట్ల మంది వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదైన ఎనిమిది కోట్ల మంది వలస కార్మికులకు జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకి రాని వారికి రేషన్ కార్డులు అందించాలని ఏప్రిల్ 2023లో జారీ చేసిన ఉత్తర్వుల అమలులో జాప్యంపై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పోర్టల్‌లో 28.6 కోట్ల మంది రిజిస్టర్లు ఉన్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఆహార భద్రత చట్టం యొక్క రక్షిత గొడుగు వెలుపల 10 కోట్ల కంటే ఎక్కువ మంది కార్మికులు మిగిలి ఉండవచ్చని శ్రీ భూషణ్ వాదించారు. ప్రతి వలస కార్మికుడిని రేషన్ కార్డు జాబితాలో త్వరితగతిన చేర్చడం సంక్షేమ రాజ్యం యొక్క విధి అని కోర్టు గత సంవత్సరం పేర్కొంది. ఇందులో 20.63 కోట్ల మంది రేషన్ కార్డు డేటాలో చోటు దక్కించుకున్నారు. ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న మిగిలిన ఎనిమిది కోట్ల మంది వలస మరియు అసంఘటిత రంగ కార్మికులకు రెండు నెలల్లో రేషన్ కార్డులు అందించాలని జస్టిస్ హిమా కోహ్లీ నేతృత్వంలోని బెంచ్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది.

ఉద్యమకారులు అంజలి భరద్వాజ్, హర్ష్ మందర్, జగదీప్ చోకర్ తరపు న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, చెరిల్ డిసౌజా లేవనెత్తిన వాదనలపై కోర్టు విచారణ చేపట్టింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఆహార భద్రత చట్టం యొక్క రక్షిత గొడుగు వెలుపల 10 కోట్ల కంటే ఎక్కువ మంది కార్మికులు మిగిలి ఉండవచ్చని శ్రీ భూషణ్ వాదించారు. ప్రతి వలస కార్మికుడిని రేషన్ కార్డు జాబితాలో త్వరితగతిన చేర్చడం సంక్షేమ రాజ్యం యొక్క విధి అని కోర్టు గత సంవత్సరం పేర్కొంది. పోర్టల్‌లో 28.6 కోట్ల మంది రిజిస్టర్లు ఉన్నారు. ఇందులో 20.63 కోట్ల మంది రేషన్ కార్డు డేటాలో చోటు దక్కించుకున్నారు.

# 21 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన డిఎంకె




**చెన్నై :** తమిళనాడులో అధికార డిఎంకె అభ్యర్థుల జాబితా, ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. మొదటి దశ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌లో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. 39 స్థానాలకు గాను డిఎంకె 21 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. సీట్ల ఒప్పందంలో భాగంగా మిగిలిన 18 స్థానాలను డిఎంకె, కాంగ్రెస్, వామపక్షాలు, విసికె తదితర మిత్రపక్షాలు పోటీ చేయనున్నాయి. డిఎంకె నుండి బరిలోకి దిగనున్న 21 మందిలో 11 మంది కొత్తవారు ఉండగా, దక్షిణ చెన్నై సిట్టింగ్ ఎంపి తమిజాచి తంగపాండియన్ సహా ముగ్గురు మహిళలు ఉన్నారు. సిట్టింగ్ ఎంపిలు కనిమొళి, టి.ఆర్ బాలు, ఎ. రాజా సహా దయానిధి మారన్, ఎస్.జగద్రక్షకన్, కళానిధి వీరసామి, కథిర్ ఆనంద్, సి.ఎన్. అన్నాదురైలో పోటీ చేయనున్నారు. ఈ సందర్భగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ.. ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.500కు తగ్గిస్తామన్నారు. లీటర్ పెట్రోల్ రూ.75కి, డీజిల్ రూ.65కి తగ్గిస్తామని ప్రకటించారు. అలాగే 100 రోజుల ఉపాధిని 150 రోజులకు పెంచుతామన్నారు. విద్యార్థుల ఎడ్యుకేషన్ లోన్స్‌ను మాఫీ చేస్తామని, విద్యార్థులకు వడ్డీలేకుండా రూ.4 లక్షల వరకు రుణాలను ఇస్తామని ప్రకటించారు.

# రాఫాలో ముమ్మరంగా కొనసాగుతున్న దాడులు




గాజా : రాఫా నగరంలో ఇజ్రాయిల్ బలగాలు జరుపుతున్న విధ్వంసక చర్యలను, కార్యకలాపాలను పాలస్తీనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. అక్కడ బాంబు దాడులు ఉధృతమయ్యాయని, ఒక పద్ధతి ప్రకారం విధ్వంసక చర్యలను చేపడుతున్నారని పేర్కొంది. అంతర్జాతీయంగా విమర్శలు, ప్రతిస్పందనలు ఎదురవకుండా వుండేందుకు మూడోకంటికి తెలియకుండా రాఫా నగర విధ్వంసాన్ని ఇజ్రాయిల్ ప్రారంభించిందని పాలస్తీనా విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాఫా నగరంలో ధ్వంసమైన ప్రాంతాలు, నివాస భవనాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోందని పేర్కొంది. కాగా దాదాపు 10లక్షల మంది పాలస్తీనియన్లు తల దాచుకున్న రాఫా నగరంపై సైన్యంతో దాడి చేయడం ఘోర తప్పిదం కాగలదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ హెచ్చరించారు. ఈ నగరంపై దాడి విషయంలో పునరాలోచన చేయాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును కోరారు. కాగా రాఫాపై పదాతిదళం దాడికి ప్రత్యామ్నాయ పద్ధతులను పరిశీలించేందుకు ఇజ్రాయిల్ ప్రతినిధి బృందాన్ని వాషింగ్టన్ పంపేందుకు ప్రధాని నెతన్యాహు అంగీకరించారు. ఇప్పటివరకు గాజా యుద్ధంలో 31,819మంది మరణించగా, 73,934మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. గాజా ప్రాంతంలోని 70శాతానికి పైగా ప్రజలు ముఖ్యంగా ఉత్తర గాజా ప్రాంతం కరువు బారిన పడే ప్రమాదం పొంచి వుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. ఈ విపత్తు పూర్తిగా మానవ కల్పితమేనని, సకాలంలో సరైన చర్యలు తీసుకుంటే నివారించదగ్గదేనని అన్నారు.

# వేసవిలో బయటకు వెళ్తున్నారా....!




ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి సూర్యుడు ఎండ వేడితో అల్లాడిస్తున్నాడు. ఇక 10,11 మధ్యాహ్నం సమయంలో అయితే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలి అంటేనే భయపడుతున్నారు. విపరీతమైన ఎండల కారణంగా ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. భగ్గుమంటున్న భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇలాంటి వేసవికాలంలో అనవసరంగా బయటకు వెళ్లకపోవడమే మంచిది. కానీ కొన్ని కొన్ని సార్లు ఎమర్జెన్సీ పనులు పడినప్పుడు బయటకు వెళ్లక తప్పదు. అయితే అలాంటప్పుడు ఎండకు వెళ్ళేటప్పుడు కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోమని చెబుతున్నారు వైద్యులు. ఒక వేళ వెళ్లాలనుకున్నప్పుడు ప్రొద్దున్న పదకొండు లోపల, సాయంత్రం నాలుగు తరువాత బయట పనులు చక్కబెట్టుకోవాలి. అలాగే ఈ కాలంలో వేసుకునే దుస్తుల నుండి తీసుకునే ఆహారం వరకు కొన్ని జాగ్రత్తలను పాటిస్తే భగభగమండే సూర్యుని కిరణాల తాకిడి నుంచి శరీరాన్ని కాపాడుకోగలమం. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లవలసి వస్తే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వెళ్లే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ తీసుకోవాలంటున్నారు. అలాగే, తల, చెవులను పూర్తి తెల్లని మెత్తని క్లాత్‌తో కప్పుకోవాలి. ఒక వాటర్ బాటిల్ తప్పనిసరిగా వెంట పెట్టుకోవాలి. ఈ నీళ్లలో కాస్త సాల్ట్, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే మంచిది. ఏసీ నుంచి డైరెక్ట్‌గా ఎండలోకి వెళ్లవద్దు. అలాగే ఎండలో తిరిగివచ్చి డైరెక్ట్‌గా ఎసి గదికి వెళ్లవద్దు. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదు. రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. త్వరగా జీర్ణం అయ్యే ఆకుకూరలు, పప్పు కూరలు ఉండాలి. నీరు శాతం అధికంగా ఉండే సొరకాయ, దోసకాయ, పొట్లకాయ తీసుకోవాలి. వేడి తగ్గుతుందని కూల్‌డ్రింగ్స్ తాగకూడదు. కొబ్బరి బోండాం, మజ్జిగ తాగండి. వడదెబ్బ వల్ల కళ్లు పొడిబారే అవకాశం ఉంది, సో సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి. ఓఆర్ఎస్, గ్లూకోజ్ నీళ్లు కొంచెం కొంచెంగా తీసుకోవాలి. కీరదోస, పుచ్చకాయ ముక్కల్ని ఎక్కువగా తినాలి. సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవటం మంచిది. అలాగే ఎండ ఎక్కువగా వున్న సమయంలో వంట చేయకుండా ఉండాలి.

# పరగడుపున నీరు తాగితే కలిగే లాభాలు..



మనలో చాలా మంది ఉదయం లేచిన తర్వాత టీ, కాఫీ తాగడానికి ఇష్టపడతారు. అయినప్పటికీ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా మంది ఉదయం గ్రీన్ టీ లేదా ఇతర ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకుంటారు. కానీ, ఉదయం నిద్రలేచిన తర్వాత నీటిని తాగడం ఆరోగ్యానికి చాలా రెట్లు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం పళ్ళు తోముకోకుండా నీటిని తాగడం అనేక తీవ్రమైన వ్యాధులను నయం చేస్తుందని మనకు తెలిసిందే.

ఉదయం పూట పళ్లు తోముకోకుండా నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. కానీ బ్రష్ చేయకుండా నీటిని 2 గ్లాసుల కంటే ఎక్కువ తాగకూడదు. ఈ సమయంలో శరీరం యాక్టివ్ అవుతుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల వికారం, వాంతులు సంభవించవచ్చు.

మరోవైపు మీరు నీటిని సమతుల్య పద్ధతిలో తాగితే అది పిత్తాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియ ప్రక్రియ కూడా సమతుల్యంగా ఉంచుతుంది. అంతే కాకుండా ఇది టాక్సిన్స్ ను తొలగిస్తుంది. పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఎసిడిటీ, పుల్లని త్రేనుపు, కడుపు నొప్పి వంటి అనేక తీవ్రమైన సమస్యలు స్వయంచాలకంగా తగ్గుతాయి.

అంతే కాదు రోగ నిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది బరువును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ముఖంలో మెరుపును తెస్తుంది. ఇటువంటి పరిస్థితిలో ఈ కారణాల వల్ల మీరు ముఖం కడుక్కోకుండా నీటిని తాగాలి. జీర్ణక్రియ ప్రక్రియ కూడా సమతుల్యంగా ఉంచుతుంది. అంతే కాకుండా ఇది టాక్సిన్స్ ను తొలగిస్తుంది. పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఎసిడిటీ, పుల్లని త్రేనుపు, కడుపు నొప్పి వంటి అనేక తీవ్రమైన సమస్యలు స్వయంచాలకంగా తగ్గుతాయి.


# పిల్లలకు చిప్స్ ఇస్తున్నారా....?



చిప్స్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. చిన్న పిల్లల నుంచి మొదలుకుని పెద్ద వారి వరకు చిప్స్ అంటే ఎంతో ఇష్టంగా తింటుంటారు. చిప్స్ లో కూడా ఎన్నో రకాల ఫ్లేవర్స్ మార్కెట్లో అందుబాటులోకి వస్తున్నాయి. రంగురంగుల కలర్లలో అందరినీ ఆకర్షించే విధంగా చిప్స్ ను ప్యాక్ చేసి మార్కెట్లోకి సప్లై చేస్తుంటారు. అయితే ప్రతి ఒక్కరు ఎంతో ఇష్టంగా తినే చిప్స్ తో ఎన్నో దుష్ప్రభావాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఈ చిప్స్ తినడంవలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. ప్యాకింగ్ చేసిన చిప్స్ ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే వాటిలో సోడియంను ఎక్కువగా వినియోగిస్తారు. ఈ సోడియంను అధికమోతాదులో తీసుకోవడం వలన రక్తపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే చిప్స్ తయారీ కోసం వినియోగించే నూనె ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం ఎక్కువగా పాడయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చిప్స్‌లో నిలువ ఉండే ట్రాన్స్ ఫ్యాట్ శరీరంలో అధిక కొవ్వును పెంచుతుంది. దాంతో ధమనుల్లో రక్త ప్రసరణ తక్కువగా ఉంటుంది. దీంతో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. చిప్స్ కారణంగా శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో అధిక బరువు పెరిగి ఊబకాయం బారిన పడుతున్నారు.

# అనారోగ్య సమస్యలున్నవారు అరటి పండు తింటే..?

అరటిపండు వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికి తెలిసిందే. అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ పండుని చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరు ఇష్టపడి తింటూ ఉంటారు. కాగా మనకు ఈ అరటిపండ్లు మనకు ఏడాది పొడవునా లభిస్తూ ఉంటాయి. అయితే అరటిపండు ఆరోగ్యానికి మంచిదే కానీ , కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ పండ్లు తీసుకోవడం అసలు మంచిది. మరి ఎటువంటి సమస్యలు ఉన్నవారు అరటిపండు తినకూడదు? ఒకవేళ తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అరటిపండ్లలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. కాబట్టి అరటి పండ్లను డయాబెటిస్ ఉన్నవారు ఎక్కువగా తినకూడదు. అంతేకాదు జీర్ణ సంబంధమైన వ్యాధులతో బాధపడే వారు కూడా అరటి పండ్లను తినకూడదు. డయాబెటిస్ తో బాధపడుతున్న వారు వారికి రక్తంలో చక్కెర మరింత పెరిగి తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు అరటి పండ్లను తినకుండా ఉంటేనే మంచిది. అలాగే శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు అరటి పండ్లను తినకూడదు. అంతేకాదు విపరీతమైన జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారు కూడా అరటి పండ్లను తినకూడదు. అలర్జీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా అరటి పండ్లకు దూరంగా ఉండాలి. మైగ్రేన్ తో బాధపడే వారు అరటి



పండ్లను తినకుండా ఉంటేనే మంచిది. మైగ్రేన్ తో బాధపడేవారు అరటిపండ్లను తినకుండా ఉండాలి. ఇది మైగ్రేన్ సమస్యను మరింత పెంచుతుంది. ఇక అజీర్ణ సమస్యలు ఉన్నవారు అరటిపండ్లను చాలా తక్కువగా తినాలి. ఎక్కువ అరటి పండ్లు తింటే జీర్ణ సమస్యలు మరింత పెరుగుతాయి. మలబద్ధకం సమస్య ఉన్నవారు కూడా అరటిపండును తినకుండా ఉండాలి. ఇక లూజ్ మోషన్స్ అవుతున్న వారు విరోచనాలను తగ్గించడానికి అరటి పండ్లను తింటారు కానీ, ఎక్కువ అరటి పండ్లు వీరు కూడా తినడం మంచిది కాదు.

# నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారా....

ఈ రోజుల్లో చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్న తెలిసిందే. రాత్రిళ్ళు సరిగా నిద్ర పట్టక అనేక రకాల సమస్యలు బారిన పడుతున్నారు. అంతేకాకుండా రాత్రిళ్ళు నిద్రపోవడానికి ఒక చిన్నపాటి యుద్ధం చేస్తున్నారని చెప్పవచ్చు. ఇక నిద్ర పట్టడానికి ఎన్నో ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు. రాత్రిళ్ళు నిద్ర సరిగ్గా పట్టగా ఇబ్బంది పడుతున్న వారు వాటి వెనుక విషయాలు ఏంటో తప్పనిసరిగా తెలుసుకోవాలి. అంటే ఎందుకు నిద్ర పట్టడం లేదు దాని వెనుక ఉన్న కారణం ఏంటి అన్న వివరాలు కూడా తెలుసుకోవాలి. నిద్ర లేకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. ప్రస్తుతం చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. నిద్రలేమి సమస్య కారణంగా దినచర్య కూడా దెబ్బతింటుంది. చేసే పనిలో ఉత్పాదకత తగ్గుతుంది. మంచి గాఢమైన నిద్రను పొందకపోతే, అందుకు ఇతర కారణాలతో పాటు మీ శరీరంలో విటమిన్ లోపం కూడా కారణం అయ్యి ఉండవచ్చు. అసలు ఏ విటమిన్ లోపిస్తే నిద్రలేమి సమస్య వస్తుంది అనేది ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. మెలటోనిన్ , సెరటోనిన్ అనే హార్మోన్లు మంచి నిద్రకు కారణంగా భావిస్తారు. విటమిన్ బి6 ఈ రెండు హార్మోన్ల స్రావాన్ని పెంచుతుంది. విటమిన్ బి 6 ఉన్న ఆహారాన్ని ప్రతిరోజు ఆహారంలో చేర్చుకుంటే మంచి నిద్ర వస్తుంది.




# ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయను తింటున్నారా..!



వేసవి కాలం మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సూర్యుడు తన విశ్వరూపం చూపిస్తున్నాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లగానే విపరీతంగా చెమటలు పడుతున్నాయి. మన శరీరం నుండి పోషకాలను కోల్పోవడం వల్ల ఇది సంభవిస్తుంది. కానీ దీన్ని బ్యాలెన్స్ చేయడానికి చాలా మంది పుచ్చకాయలను ఎక్కువగా తింటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి కాబట్టి, ఈ పండు తినడం వల్ల మీ పొట్ట నిండుగా ఉన్న అనుభూతినిస్తుంది. పుచ్చకాయ వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని కాపాడుతుంది. దీనిలో 92% నీరు కూడా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు మాత్రం పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచి తింటారు. అయితే, ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయి. సాధారణంగా కొంతమంది మార్కెట్ నుంచి తీసుకురాగానే పండ్లను ఫ్రిజ్ లో నిల్వ చేసి రెండు, మూడు రోజుల తర్వాత తింటుంటారు. మరి కొందరు పుచ్చకాయను సగం కోసి ఫ్రిజ్ లో పెడుతుంటారు. కానీ ఇది మంచిది కాదని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. అయితే, కట్ చేసిన పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తే ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం ఉంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరమని నిపుణులు చెబుతున్నారు.

# మునగకాయలు సమస్యలకు చెక్..!



సీజన్ ను బట్టి మనకు అందుకు తగ్గట్టుగా పండ్లు కూరగాయలు వంటివి లభిస్తూ ఉంటాయి..అలా వేసవి కాలంలో లభించేటువంటి వాటిలో మునక్కాయలు కూడా ఒకటి.. ఈ మునక్కాయలను మనం ఫ్రైగా అయినా చేసుకోవచ్చు.. లేకపోతే సాంబార్‌గా చేసుకొని తినవచ్చు. డైట్లో భాగంగా మునక్కాయలను చేర్చుకుంటే ఎన్నో ఆరోగ్యమైన అద్భుత ప్రయోజనాలు ఉన్నాయి.. మునగకాయలే కాకుండా మునగ ఆకులతో కూడా ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి.

ఈ ఆకులలో కూడా చాలా పోషకాలు కలిగి ఉన్నాయి. మునక్కాయలలో ఉండేటువంటి విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ మన శరీరానికి ఇమ్యూనిటీని పెంచడానికి సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే విటమిన్ ఏ, క్యాల్షియం, ఐరన్ వంటివి తీసుకోవడం వల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉండడానికి సహాయపడతాయి. మునక్కాయలలో ఉండేటువంటి ఫైబర్ వల్ల అజీర్ణం మలబద్ధక సమస్యలకు సైతం నివారణగా పనిచేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరచడానికి సహాయపడతాయి. మునక్కాయలలో ఆకులలో కూడా ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ సేపు కడుపు నిండిన ఫీలింగ్ కూడా కలుగుతుంది. దీనివల్ల బరువు సైతం అదుపులో ఉంచుకునేలా సహాయపడుతుంది. మునక్కాయలలో ఉండే ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్ వంటివి.. కీళ్లనొప్పున అలర్జీ వంటి లక్షణాలను కూడా తగ్గించడానికి సహాయపడతాయి. వీటిని ప్రతిరోజు తినడం వల్ల శరీరంలో ఉండేటువంటి మంటను సైతం తగ్గిస్తాయట. మునక్కాయలలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎండాకాలం వీటిని తినడం వల్ల డిహైడ్రేషన్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.. మునక్కాయలలో ఎక్కువగా కూలింగ్ చేసే గుణం కలిగి ఉంటుంది. అందుకే శరీరంలో అధిక చమట అలసట వంటివి తగ్గించడానికి ఉపయోగపడతాయి. మునక్కాయలను మనం ఏవిధంగా అయినా సరే తినడం వల్ల లాభాలే ఉన్నాయి.. మునక్కాయలు తినడానికి రుచిగానే ఉండడమే కాకుండా శరీరానికి అవసరమైన పోషకాలను కూడా అందించడానికి సహాయపడతాయి.. అందుకే కనీసం నెలలో ఒక్కసారైనా మునక్కాయలను తినడం మంచిదని నిపుణులు తెలియజేస్తూ ఉంటారు. మునక్కాయలలో ఎక్కువగా కూలింగ్ చేసే గుణం కలిగి ఉంటుంది. అందుకే శరీరంలో అధిక చమట అలసట వంటివి తగ్గించడానికి ఉపయోగపడతాయి. మునక్కాయలను మనం ఏవిధంగా అయినా సరే తినడం వల్ల లాభాలే ఉన్నాయి.

# అందాల ఆరబోతలో పోటీపడుతున్న రాశీఖన్నా



టాలీవుడ్ సుందరి రాశీ ఖన్నా అందాల ప్రదర్శనలో ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజు అంతకుమించి అనేలా దూసుకెళుతుందే తప్పితే ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ప్రస్తుతం టాలీవుడ్‌ను సైడ్‌కు పెట్టి పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి పెట్టిన ఈ ముద్దుగుమ్మ అక్కడ పోటీలో నిలబడేందుకు, అవకాశాలు పట్టేయడానికి గ్లామర్ డోస్ పెంచుతూ పోతూ ఇక్కడ కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెడుతోంది.వారం రోజుల క్రితం అసలు బట్టలు ఉన్నాయా లేవా అనే విధంగా బట్టలు వేసుకుని ఫొటోషూట్లు చేసిన ఈ చిన్నది.. మళ్లీ ఇప్పుడు అదే స్థాయిలో అందాల ప్రదర్శన చేసి అభిమానులకు కనులవిందు చేసింది.తాజాగా రెడ్ అవుట్ ఫిట్‌లో డ్రెస్‌ను జార విడిచి మరి అందాలను చూపిస్తూ మెస్మరైజ్ చేసింది. దీంతో అభిమానులు సినిమాలు లేకున్నా ఫర్లేదు మూడు రోజులకోసారి ఈ మాత్రం దర్శనం ఇస్తే చాలు అనేంత వరకు ఫ్యాన్స్ వెళ్లి పోయారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో సిద్ధార్థ్ మల్హోత్రా తో కలిసి యోధ అనే వార్ ఓరియంటెడ్ సినిమాలో నటించగా అది త్వరలో విడుదలకు రెడీ అయింది. ఇక తెలుగులో డీజే టిల్లు స్టార్ జొన్నలగడ్డ సిద్ధుతో కలిసి చేస్తున్న తెలుసుకదా అనే చిత్రం తప్పితే మరో చిత్రానికి సంతకం చేయలేదు.ఇక హిందీలో ఫర్జీ అనే వెబ్ సిరీస్ పార్ట్2 లో నటించనుంది.

## ప్రభాస్‌తో మళ్లీ సినిమా చేయాలని ఉంది భీమా చిత్ర విశేషాలను పంచుకున్న గోపీచంద్



విజయం కోసం పరితపిస్తున్న నటుల్లో గోపీచంద్ ఇప్పుడు 'భీమా' అనే సినిమాతో మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది, ఈ సినిమా నేపథ్యం పరశురామ క్షేత్రం అని చెప్పారు. డిసెంబర్‌లో విడుదల చెయ్యాలని అనుకున్నా..అప్పట్లో 'సలార్' లాంటి పెద్ద సినిమా రావటం వల్ల వాయిదా వేసుకున్నారు. జనవరిలో కూడా పండగ సినిమాలు చాలా వున్నాయి, ఇక అలా వాయిదా పడుతూ ఇప్పుడు మార్చి 8, మహా శివరాత్రికి విడుదల కానుంది. 'భీమా' సినిమా గురించి గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమా అన్ని భావోద్వేగాలు కలగలిపిన ఒక వాణిజ్యపరమైన సినిమా. తప్పకుండా ఆడుతుంది అనే నమ్మకం మాత్రం వుందని చెప్పారు. దర్శకుడు హర్ష ఈ కథ నాకు చెప్పేటప్పుడు, భీమా పాత్రకి నేను బాగా కనెక్ట్ అయ్యాను. ఇంతకు ముందు పోలీసాఫీసర్ పాత్రలు చేసినా అందులో కథ అంతా ఆ పోలీసు పాత్ర చుట్టూ తిరుగుతాయి, కానీ ఇందులో అలా కాదు, వేరేలా ఉంటుంది, ఒక చిన్న సెమి ఫాంటసీ కూడా ఉంటుంది, ఆ పాయింట్ కొత్తగా ఉండటమే కాకుండా నాకు బాగా నచ్చి ఈ సినిమా చేసాను అని గోపీచంద్ చెప్పారు.'భీమా'లో కూడా రెండు పాత్రలు ఒకటి పోలీసాఫీసర్, రెండోది ఒక శక్తివంతమైన పాత్ర వున్నాయి. 'అఖండ' సినిమాతో ఈ 'భీమా' పోల్చడం నాకైతే మంచిదే అనిపిస్తుంది. ఈ సినిమాలో పోరాట సన్నివేశాలు వున్నాయి, అలాగే వినోదాత్మక సన్నివేశాలు కూడా చాలా వున్నాయి. దీనికితోడు మంచి భావోద్వేగాలు వున్నాయి. పోరాట సన్నివేశాలలో హీరో వెళ్లి పది ఇరవై మందిని కొడితే ప్రేక్షకుడు చాలా బోర్ ఫీల్ అవుతాడు, ఒక సెన్స్ లేకుండా పోతుంది, అదే అందులో ఒక భావోద్వేగం వుండి, ఆ పోరాట సన్నివేశం చేస్తే, చేసేవాళ్ళకి, చూసే వాళ్ళకి కూడా హత్తుకుంటుంది. ఈ సినిమాలో అన్ని అలా కుదిరాయని చెప్పారు. 'లౌక్యం' లాంటి సినిమాలు' అని చెప్పారు. 'లౌక్యం' విజయం సాధించింది. 'భీమా'లో అన్ని ఎలెమెంట్స్ వున్న సినిమా, బాగుంటుంది అనే అనుకుంటున్నా. ప్రతి సినిమా విజయం సాధించాలని ప్రతి నటుడు కష్టపడి చేస్తారు. 'భీమా' సినిమా దర్శకుడు హర్ష ఈ సినిమా లో కథనం, ట్విస్ట్ లు అన్నీ బాగా

**'భీమా' అనే సినిమాతో మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.**

చూపించగలిగాడు. పాన్ ఇండియా సినిమా కోసం కథ రాసుకుంటే నడవదు, ఎందుకంటే హిందీ ప్రేక్షకులకి, మన ప్రేక్షకులకి చాలా విషయాల్లో వ్యత్యాసం వుంది. ఇప్పుడు ఒక్క ప్రభాస్ కి తప్పితే ఏ నటుడూ కూడా పాన్ ఇండియా సినిమాలు చెయ్యడం లేదు, ఆ నటులకి కథలు రాయటం లేదు. ఎప్పటికైనా ప్రభాస్ తో మళ్ళీ కలిసి సినిమా చెయ్యాలని వుంది అని చెప్పారు గోపీచంద్. అతనొక్కడితోటే కాదు, మిగతా నటులతో కూడా కథ నచ్చితే సినిమా చేస్తాను అని చెప్పారు. తన రాబోయే సినిమాల గురించి మాట్లాడుతూ దర్శకుడు శ్రీను వైట్ల తో సినిమా 30 శాతం పూర్తయిందని, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తో ఒక సినిమా ఉందని, అలాగే దర్శకుడు రాధాకృష్ణతో కూడా కథా చర్చలు జరుగుతున్నాయని, ఆ సినిమా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుందని చెప్పారు.

## అల్లు అర్జున్ నటనంటే ఎంతో ఇష్టం నటి సమంత హాట్ కామెంట్స్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించింది అగ్ర కథానాయిక సమంత. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ వీడియోలు వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ కాలేజీ ఫెస్ట్‌లో పాల్గొన్న సమంతను కొందరు స్టూడెంట్స్ 'నటనలో మీకు స్ఫూర్తి ఎవరు?' అని అడిగారు. 'యాక్టింగ్‌లో నాకు అల్లు అర్జున్ స్ఫూర్తి అని సమాధానమిచ్చింది. తనతో కలిసి మరోసారి సినిమా చేయాలనుకుంటున్నా. ఎందుకంటే యాక్టింగ్ బీస్ట్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు బన్నీ' అని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ వీడియోలను బన్నీ ఫాన్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. గతంలోనూ ఓ సందర్భంలో సమంత ఇదే విషయాన్ని చెప్పింది. అల్లు అర్జున్ తన సూపర్ హీరో అని చెప్పింది. వీళ్లిద్దరూ కలిసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి'లో నటించారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా చక్కని విజయాన్ని అందుకొంది. అలాగే సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన 'పుష్ప'లో అల్లు అర్జున్, సమంత 'ఊ అంటావా..' పాటకు స్టెప్పులేశారు. ఈ పాట పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపింది.

# ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు దూకా!



"కొన్ని కథలు విన్నప్పుడు నన్ను నేను నియంత్రించుకోలేను. 'గామి' కథ విన్నప్పుడు నాకు అలాంటి అనుభూతే కలిగింది. కచ్చితంగా అందులో భాగం కావాలనుకున్నా. నా మనసుకు చాలా తృప్తినిచ్చిన చిత్రమిది" అంది చాందినీ చౌదరి "కొన్ని కథలు విన్నప్పుడు నన్ను నేను నియంత్రించుకోలేను. 'గామి' కథ విన్నప్పుడు నాకు అలాంటి అనుభూతే కలిగింది. కచ్చితంగా అందులో భాగం కావాలనుకున్నా. నా మనసుకు చాలా తృప్తినిచ్చిన చిత్రమిది" అంది చాందినీ చౌదరి. ఆమె.. విష్వక్ సేన్ ప్రధాన పాత్రల్లో విద్యాధర్ కాగిత తెరకెక్కించిన చిత్రమే 'గామి'. కార్తీక్ శబరీష్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 8న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది చాందిని.

**ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి..**

"మను' చిత్రం చేస్తున్నప్పుడు దర్శకుడు విద్యాధర్ పరిచయమయ్యారు. అప్పుడే ఈ 'గామి' గురించి చెప్పారు. చాలా విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో తీసిన సినిమా ఇది. దీని వల్లే చిత్రీకరణకు చాలా ఎక్కువ సమయం పట్టింది. అందువల్లే విజువల్స్ కూడా ఎంతో అద్భుతంగా వచ్చాయి. ఐమాక్స్ స్క్రీన్‌లో ఈ చిత్ర ట్రైలర్ చూసినప్పుడు మేము పడిన కష్టానికి ప్రతిఫలం లభించిందని ఆనందంతో కన్నీళ్లు వచ్చేశాయి".

**క్లైమాక్స్ అద్భుతం**

"ఈ చిత్రంలో నా పాత్ర.. విష్వక్ పాత్రకు సంబంధించిన కథలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి. మరి మా ఇద్దరి లక్ష్యాలు ఎలా ఒక్కటయ్యాయో తెలియాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే. ఈ చిత్ర క్లైమాక్స్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. నాకు తెలిసి ఇలాంటి సినిమా తెలుగులో ఇప్పటి వరకు రాలేదు. ఇది విజయవంతమైతే ఇలాంటి మరిన్ని అద్భుతమైన కథలు తెరపైకి వస్తాయి.

**చిత్రీకరణ ఆద్యంతం సవాళ్లే!**

"ఈ చిత్ర ప్రయాణమంతా ఓ సాహస యాత్రలా జరిగింది. నేను ఈ ప్రాజెక్ట్‌లో మొదటి రోజు నుంచి ఉన్నాను. దీని చిత్రీకరణ వారణాసి, కశ్మీర్, హిమాలయాలు.. ఇలా ఎన్నో రియల్ లొకేషన్స్‌లో జరిగింది. కుంభమేళాలో అఘోరాల మధ్య కూడా చిత్రీకరణ జరిపాం. ముఖ్యంగా హిమాలయాల్లో చిత్రీకరణ జరుపుతున్నప్పుడు చాలా కఠినమైన పరిస్థితులు ఎదుర్కొన్నాం. మా టీమ్ మొత్తంలో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. అందరం ఒకే బస్సులో హిమాలయాల్లోకి వెళ్లి సూర్యాస్తమయం వరకు చిత్రీకరణ చేసి వచ్చే వాళ్లం. అక్కడ వాష్ రూమ్స్ లాంటివి ఉండవు కాబట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లు కూడా తాగేదాన్ని కాదు. అలా నెల రోజులు షూట్‌లో పాల్గొన్నా. గడ్డ కట్టిన నదిపై చిత్రీకరణ జరుపుతున్నప్పుడు మంచు ఫలకాల మధ్య పగుళ్లు ఏర్పడి నదిలో పడే పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో నా దగ్గర ఉన్న బరువైన లగేజ్‌ను దూరంగా విసిరేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరిగెత్తుకుంటూ బయటకు దూకా. ఇలా చిత్రీకరణ ఆద్యంతం ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా".

**పదేళ్ల ప్రయాణం నమ్మశక్యంగా లేదు!**


"చిత్ర పరిశ్రమలో పదేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నానంటే నమ్మశక్యంగా లేదు. నాకు ఇక్కడికి వచ్చినప్పుడు ఎలా మాట్లాడాలో కూడా తెలియదు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నా. ఇక్కడ ఆపకుండా ఏదోకటి చేస్తూనే ఉండాలి. బాలకృష్ణ హీరోగా బాబీ తెరకెక్కిస్తున్న చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నా.

## మహేశ్‌బాబు సినిమా కోసం రాజమౌళి కసరత్తు



మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందబోయే సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే నిర్మాణ సంస్థ నుంచి గానీ, దర్శకుడి నుంచి గానీ ఇప్పటిదాకా అధికారికంగా ఎలాంటి అప్‌డేట్ లేదు. కానీ రోజుకో కొత్త విషయం వైరల్ అవుతూనే ఉంది. దీనిపై సినిమా టీమ్ ఎక్కడా స్పందించలేదు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి స్పందిస్తూ, 'మహేశ్‌తో సినిమా తీస్తున్నా. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ టైటిల్ ఇంకా ఖరారు కాలేదు' అని అన్నారు. ఇప్పుడు మహేశ్‌బాబు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరొక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'రాజమౌళి సర్‌తో చేసే సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు చాలా బాగా జరుగుతున్నాయి. త్వరలోనే ఆయనతో ప్రయాణం మొదలుపెట్టడానికి చాలా ఆసక్తిగా ఉన్నా' అని అన్నారు. ఈ అప్‌డేట్‌తో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు నన్ను బాగా ప్రభావితం చేసి, నా కెరీర్‌ను మలుపు తిప్పాయని మహేశ్ బాబు అన్నారు. డిఫరెంట్ స్టోరీ లైన్లతో తెరకెక్కించిన ఈ చిత్రాలు ఆడియన్స్ కు నన్ను మరింత దగ్గర చేశాయి. ప్రేక్షకులకు నచ్చేలా సినిమాలు చేయాలని నైతిక అంశాల ఆధారంగా కథను ఎంపిక చేసుకుంటాను. ఒకే రకమైన పాత్రల్లో నటించడం నాకు నచ్చదు. వ్యక్తిగత విలువలకు దగ్గరగా ఉంటూ, నా స్వభావాన్ని అభిమానులకు తెలియజేసేలా ఉన్న పాత్రలు పోషిస్తా. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు ముఖ్యమైనప్పటికీ సినిమా ప్రేక్షకులపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొంటున్నా. అందులో భాగంగానే 'గుంటూరు కారం'లో నటించాను. ఈ చిత్రానికి సవాళ్లు ఎదురైనా ప్రేక్షకుల ఆదరణ పొందింది. నా అభిమానులే ఇందుకు కారణం. ఒక సినిమాకు సైన్ చేశానంటే అది పూర్తయ్యేదాకా దర్శకుడి విజన్ ప్రకారమే నడుచుకుంటా' అని మహేశ్ బాబు అన్నారు. మహేశ్ బాబు చిత్రంతో భారతీయ సినిమా చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని ఇటీవల రచయిత విజయేంద్రప్రసాద్ చెప్పారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కూడా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లోనూ అనువదించనున్నారు. ఇప్పటివరకూ వెండితెరపై కనిపించని సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపిస్తారని, ఆ దిశగా జక్కన్న పాత్రను తీర్చిదిద్దనున్నారని మొదటి నుంచి టాక్ వినిపిస్తోంది. గడ్డం పెంచి, పొడవాటి జుట్టుతో ఇందులో కనిపించనున్నారని తెలుస్తోంది. అదే సమయంలో దృఢంగా కనిపించేందుకు అవసరమైన కసరత్తులు మహేశ్ చేస్తున్నారు. ఇటీవల మహేష్ లుక్‌కి సంబంధించిన స్కెచ్లు పూర్తయ్యాయని తెలిసింది.


## శరవేగంగా దేవర చిత్ర నిర్మాణం




యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' కొరటాల శివ దర్శకుడు. కొంతగ్యాప్ తర్వాత మళ్లీ ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుగుతుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేక సెట్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివ. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సన్నివేశాలను ఎన్టీఆర్, మురళీశర్మ తదితరులపై చిత్రీకరణ చేస్తున్నారు. దాంతోపాటు పలు యాక్షన్ సన్నివేశాలు కూడా అక్కడ ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఓ ప్రమాదంలో గాయాలపాలు కావడంతో ఆయన కొద్దిరోజులుగా రెస్ట్‌లో ఉన్నారు. కోలుకుని సెట్‌లో అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పడుతుందని సమాచారం. ఆయన కోసమే షూటింగ్‌కు కాస్త గ్యాప్ ఇచ్చారు. ఆలస్యం కావడంతో ప్రస్తుతం తారక్‌తోపాటు ఇతర తారాగణంపై గ్రామీణ నేపథ్యంలో సాగే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రెండు భాగాలుగా ప్లాన్ చేసిన ఈ చిత్రం మొదటి పార్ట్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ పలు కారణాల చేత అక్టోబర్ 10 తేదీకి వాయిదా పడింది. ఇందులో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే ఆమెపై కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలు. దేవి శ్రీ ప్రసాద్ నిర్మిస్తున్నారు.

# అధిక రాబడి వస్తుందని వ్యాపారాల్లో పెట్టుబడి పెడుతున్నారా..

## ముందు ఈ విషయాలు ఆలోచించండి!



'ట్రింగ్.. ట్రింగ్' ఫోన్ మోగింది. 'జమీందార్‌గారి అల్లుడు ఉన్నాడా?' అని అడిగాడా అవతలి వ్యక్తి. 'ఉన్నారు బాబు..' అని అల్లుడుగారికి ఫోన్ ఇచ్చాడు పెద్ద పాలేరు. అప్పటిదాకా కులాసాగా ఉన్న ఆయనగారు ఫోన్‌లో మాట్లాడుతుండగానే దిగాలుగా ముఖం పెట్టేశాడు. ఉన్నపళంగా కుదేలయ్యాడు. నిల్చున్నచోటే కూలబడిపోయాడు. కారణం.. ఆ ఫోన్ చేసిన వ్యక్తి.. 'సింగపూర్ నుంచి బయల్దేరిన సరుకు ఓడలు తుఫాన్ ధాటికి సముద్రంలో మునిగిపోయాయ'ని చావు కబురు చల్లగా చెప్పాడు. మామగారి ఆస్తిపై కూడా అప్పు చేసి పెట్టిన పెట్టుబడంతా కడలి పాలవ్వడంతో ఒక్క ఫోన్‌కాల్‌తో కోటీశ్వరుడు కాస్తా బికారిగా మారిపోయాడు. ఇలాంటి సన్నివేశాలు బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో చాలాసార్లు చూసే ఉంటాం. ఆగర్భ శ్రీమంతులైనా, నడమంత్రపు సిరి కలిసొచ్చినా ఐశ్వర్యం శాశ్వతం కాదన్న సత్యం గుర్తెరిగి ఉండాలి. 'దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాల'న్న సామెత మర్చిపోతే.. దురదృష్టం వెంటాడిన నాడు అప్పటిదాకా అండగా ఉన్న అదృష్టం కూడా ముఖం చాటేస్తుంది. ఊహించని అద్భుతాలు జరిగితే నిరుపేద బతుకుల్లో, మధ్యతరగతి జీవితాల్లో రాత్రికి రాత్రి పెద్దగా మార్పులేం జరగవు. అదే మార్పు సిరిగలవాడింట చోటు చేసుకుంటే.. ఆ చేటును తట్టుకునే చేవ వారికి ఉండకపోవచ్చు. అలా జరగొద్దంటే గల్లా పెట్టెలో కాసులు గలగలలాడుతున్నా, బోషాణంలో ఏడువారాల నగలు నిగనిగలాడుతున్నా, ట్రంకు పెట్టెలో దస్తావేజులు దుమ్ముకొట్టుకుపోతున్నా అనుక్షణం అప్రమత్తమై ఉండాల్సిందే! చిన్న ఏమరుపాటు వీటన్నిటినీ లాక్కెళ్లిపోయే ప్రమాదం ఉంది. ముప్పులు ముంచుకొచ్చే దాకా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తే.. స్వీయ పతనానికి నాంది పలికినట్టే! ఆదాయం ఎలా వస్తున్నదన్న దానిపైనే ఖర్చు ఆధారపడి ఉండాలి. స్థిరమైన ఆదాయం అంటే ఉద్యోగార్జితమో, స్థిరచరాస్తుల ద్వారా సమకూరే సంపద ధైర్యాన్ని ఇస్తుంది. లక్షల్లో వేతనం వస్తున్న ఉద్యోగులు ఖర్చుల దగ్గర కాస్త తికమకపడ్డా కొంపలేం మునిగిపోవు.

## అతి తక్కువ వడ్డీకే పర్సనల్ లోన్లు..

### ఈ బ్యాంకుల్లో ప్రాసెసింగ్ ఫీజు కూడా తక్కువే




ఈ రుణాలు మీ ఊహించని ఖర్చులను కవర్ చేస్తాయి. ఎటువంటి పత్రాలు కూడా అవసరం లేదు. అయితే దీనిలో వడ్డీ మాత్రం మిగిలిన రుణ రకాలతో పోల్చితే అధికంగా ఉంటాయి. ఎందుకంటే వీటిని అసురక్షిత రుణాలుగా బ్యాంకర్లు వర్గీకరిస్తారు. క్రెడిట్ కార్డు రుణాలతో పోల్చితే మాత్రం తక్కువ వడ్డీ రేట్లే ఉంటాయి. వీటిల్లో వడ్డీ రేట్లు అన్ని బ్యాంకుల్లో ఒకలా ఉండవు. అలాగే వ్యక్తులను బట్టి కూడా మారుతుంటాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక వెసులుబాటును కల్పించేవి పరనల్ లోన్లు(వ్యక్తిగత రుణాలు). బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేయకుండా బ్యాంకులో ఎటువంటి తనఖా లేకుండా మంజూరయ్యే లోన్లు ఇవి. ఈ రుణాలు మీ ఊహించని ఖర్చులను కవర్ చేస్తాయి. ఎటువంటి పత్రాలు కూడా అవసరం లేదు. అయితే దీనిలో వడ్డీ మాత్రం మిగిలిన రుణ రకాలతో పోల్చితే అధికంగా ఉంటాయి. ఎందుకంటే వీటిని అసురక్షిత రుణాలుగా బ్యాంకర్లు వర్గీకరిస్తారు. క్రెడిట్ కార్డు రుణాలతో పోల్చితే మాత్రం తక్కువ వడ్డీ రేట్లే ఉంటాయి. వీటిల్లో వడ్డీ రేట్లు అన్ని బ్యాంకుల్లో ఒకలా ఉండవు. అలాగే వ్యక్తులను బట్టి కూడా మారుతుంటాయి. రుణ గ్రహీతల వయస్సు, వారి క్రెడిట్ చరిత్ర, నెలవారీ ఆదాయం, ఇప్పటికే ఉన్న రుణాలు, మొత్తం ఆర్థిక పరిస్థితి, యజమాని వర్గం (ఎంఎన్సీ/ ప్రభుత్వం/ రక్షణ, మొదలైనవి)ను బట్టి మారుతుంటుంది. అదే సమంలో మీ క్రెడిట్ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే, అంత తక్కువకు మీరు రుణాలు పొందుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం(మార్చి 13, 2024 నాటికి) ఈ పర్సనల్ లోన్లపై హెచ్డీఎఫ్సీ బ్యాంక్ అతి తక్కువ వడ్డీ రేటు 10.50% అందిస్తోంది. మిగిలిన బ్యాంకులలో వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్.. ఈ బ్యాంక్ అత్యల్ప వడ్డీ రేటు అందిస్తోంది. ఏడాదికి 10.50శాతం నుంచి వడ్డీ రేటు ప్రారంభమవుతుంది. 5 సంవత్సరాల కాలవ్యవధిలో రూ. 5 లక్షల రుణ మొత్తానికి ఈఎంఐ రూ. 10,747 నుంచి ప్రారంభమవుతుంది. రూ. 1 లక్షకు, ఇది రూ. 2,149 నుంచి ప్రారంభమవుతుంది. ప్రాసెసింగ్ ఫీజు రూ. 4,999గా వరకు ఉంటుంది. టాటా క్యాపిటల్.. టాటా క్యాపిటల్ వడ్డీ రేట్లు సంవత్సరానికి 10.99% నుంచి ప్రారంభమవుతాయి. 5 సంవత్సరాలకు రూ. 5 లక్షల రుణం కోసం ఈఎంఐ రూ. 10,869 నుంచి ప్రారంభమవుతాయి. రూ. 1 లక్షకు ఈఎంఐ రూ. 2,174 నుంచి ప్రారంభవుతుంది. ప్రాసెసింగ్ రుసుము లోన్ మొత్తంలో 5.5% వరకు ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. ఈ బ్యాంక్ సంవత్సరానికి 11.15% నుంచి 15.30% వరకు వడ్డీ రేట్లకు పర్సనల్ లోన్ అందిస్తుంది. రూ. 5 లక్షల రుణానికి ఈఎంఐ రూ. 10,909 నుంచి రూ. 11,974 వరకు, రూ. 1 లక్షకు రూ. 2,182 నుంచి రూ. 2,395 వరకు ఉంటుంది. ప్రాసెసింగ్ రుసుము 1.5% వరకూ ఉంటుంది, కనిష్టంగా రూ. 1,000, గరిష్టంగా రూ. 15,000 వరకూ వసూలు చేస్తారు.ఐసీఐసీఐ బ్యాంక్.. ఈ బ్యాంక్ వడ్డీ రేట్లు సంవత్సరానికి 10.65% నుంచి ప్రారంభమవుతాయి. 5 సంవత్సరాలలో రూ. 5 లక్షల రుణ మొత్తానికి, ఈఎంఐ రూ. 10,784 నుంచి ప్రారంభమవుతాయి. అదే రూ. 1 లక్షకు, ఇది రూ. 2,157 నుంచి ప్రారంభమవుతుంది. ప్రాసెసింగ్ ఫీజు లోన్ మొత్తంలో 2.50% వరకు ఉంటుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా.. దీనిలో వడ్డీ రేట్లు సంవత్సరానికి 11.05% నుంచి 18.75% మధ్య మారుతూ ఉంటాయి. రూ.5 లక్షల రుణానికి ఈఎంఐ రూ.10,884 నుంచి రూ.12,902 వరకు, రూ.1 లక్షకు రూ.2,177 నుంచి రూ.2,580 వరకు ఉంటుంది.

## ఆ కంపెనీల్లో పెట్టుబడితో మూడేళ్లల్లోనే నమ్మలేని లాభాలు..

# టాప్ సెవెన్ కంపెనీలివే..!



చిన్న పొదుపు పథకాల వైపు స్థిర రాబడి కోసం కొంత మంది పెట్టుబడిదారులు వెళ్తూ ఉంటారు. అయితే మరి కొంతమంది మాత్రం స్టాక్స్‌లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. రిస్క్ అయినా పర్లేదు అనుకునే వారిక తక్కువ సమయంలో అధిక రాబడికి ఇవి సౌలభ్యంగా ఉంటాయి. ఇటీవల ట్రేడింగ్ సెషన్‌లో తీవ్ర పతనం మధ్య స్మాల్ క్యాప్, మిడాక్యాప్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ గేజ్ 5.11 శాతం క్షీణించగా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 4.20 శాతం క్షీణించింది. ప్రస్తుత రోజుల్లో డబ్బు సంపాదించడం అనేది ప్రతి ఒక్కరూ చేసే పనే అయినా పెద్ద స్థాయి అవసరాలకు సొమ్ము లేక ఇబ్బంది పడుతున్నారు. అయితే భవిష్యత్ అవసరాలను అర్థం చేసుకుని ఇప్పటి నుంచే పెట్టుబడి మార్గం వైపు పయనించే వాడే అప్పులపాలు కాకుండా ఉంటారని నిపుణుల భావన ఈ నేపథ్యంలో చిన్న పొదుపు పథకాల వైపు స్థిర రాబడి కోసం కొంత మంది పెట్టుబడిదారులు వెళ్తూ ఉంటారు. అయితే మరి కొంతమంది మాత్రం స్టాక్స్‌లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. రిస్క్ అయినా పర్లేదు అనుకునే వారిక తక్కువ సమయంలో అధిక రాబడికి ఇవి సౌలభ్యంగా ఉంటాయి. ఇటీవల ట్రేడింగ్ సెషన్‌లో తీవ్ర పతనం మధ్య స్మాల్ క్యాప్, మిడాక్యాప్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ గేజ్ 5.11 శాతం క్షీణించగా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 4.20 శాతం క్షీణించింది. అయితే ఇంత క్షీణతలో కూడా కొన్ని కంపెనీల పెట్టుబడిదారులు మాత్రం ఎలాంటి నష్టం లేకుండా లాభాలను గడిస్తున్నారు. ప్రస్తుతం మూడేళ్ల నుంచి పెట్టుబడిదారులకు మంచి లాభాలను ఇస్తున్న లార్జ్‌క్యాప్ ఈక్విటీ కంపెనీల గురించి ఓ సారి తెలుసుకుందాం.

**నిప్పాన్ ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్**

ఎస్అండ్‌పీ బీఎస్ఈ 100 ఇండెక్స్‌లో ఉన్న నిప్పాన్ ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్లో 23.09 శాతం, రెగ్యులర్ 22.06 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 23,307.26 కోట్లుగా ఉంది.

**ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్**

నిఫ్టీ 100 ఇండెక్స్‌లో ఒక భాగం అయిన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్‌లో 20.29 శాతం, రెగ్యులర్లో 19.57 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 52,186.35 కోట్లుగా ఉన్నాయి.

**జేఎం లార్జ్ క్యాప్ ఫండ్**

ఎస్అండ్ పీ బీఎస్ఈ 100 ఇండెక్స్ ఒక భాగం అయిన జేఎం లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్‌లో 19.77 శాతం, రెగ్యులర్ ప్లాన్లో 18.74 శాతం రాబడిని అందించింది.

# లైఫ్‌లాంగ్ ఉచిత విద్యుత్...


## చేతిలో రూపాయి లేకపోయినా ఫర్వాలేదు



ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద మీరు ఇంటిపై సోలార్ పలకను ఏర్పాటు చేసుకోవచ్చు. దాని సామర్థ్యాలకు అనుగుణంగా కేంద్రం మీకు సబ్సిడీలు అందిస్తుంది. 2 కేడబ్ల్యూ సామర్థ్యం ఉన్న సిస్టమ్‌లకు సోలార్ యూనిట్ ధరలో 60%, అలాగే 2కేడబ్ల్యూ నుంచి 3 కేడబ్ల్యూ సామర్థ్యం మధ్య సిస్టమ్‌ల కోసం 40% సబ్సిడీని అందిస్తుంది. సబ్సిడీ గరిష్టంగా 3 కిలోవాట్ల సామర్థ్యం వరకూ పరిమితం చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు మంచి పథకాన్ని ప్రకటంచింది. తమ ఇంటిని సోలార్ పవర్ స్టేషన్ గా మర్చుకునే అవకాశాన్ని అందించింది. అంటే మీ మేడపై రూఫ్ టాప్ సౌర విద్యుత్ యూనిట్ ను ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేకమైన సబ్సిడీలను ప్రకటించింది. అంతేకాక దాని నుంచి వచ్చే విద్యుత్ ను మీరు వినియోగించుకోగా.. మిగిలిన విద్యుత్ ను ప్రభుత్వానికి విక్రయించే విధంగా కొత్త స్కీమ్ అమలు చేస్తోంది. ఈ పథకం పేరు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన. ఇది రూఫ్‌టాప్ సౌర విద్యుత్ యూనిట్లను ఇన్‌స్టాల్ చేసుకునే గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందించడానికి ఉద్దేశించిన పథకం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద మీరు ఇంటిపై సోలార్ పలకను ఏర్పాటు చేసుకోవచ్చు. దాని సామర్థ్యాలకు అనుగుణంగా కేంద్రం మీకు సబ్సిడీలు అందిస్తుంది. 2 కేడబ్ల్యూ సామర్థ్యం ఉన్న సిస్టమ్‌లకు సోలార్ యూనిట్ ధరలో 60%, అలాగే 2కేడబ్ల్యూ నుంచి 3 కేడబ్ల్యూ సామర్థ్యం మధ్య సిస్టమ్‌ల కోసం 40% సబ్సిడీని అందిస్తుంది. సబ్సిడీ గరిష్టంగా 3 కిలోవాట్ల సామర్థ్యం వరకూ పరిమితం చేసింది. ప్రస్తుత బెంచ్‌మార్క్ ధర ప్రకారం, ఇది 1కేడబ్ల్యూ సిస్టమ్‌కు రూ. 30,000, 2కేడబ్ల్యూ సిస్టమ్‌కు రూ. 60,000, 3కేడబ్ల్యూ లేదా అంతకంటే ఎక్కువ సిస్టమ్‌కు రూ. 78,000 సబ్సిడీగా అందిస్తోంది.

## పేటీఎంలో మన సొమ్ము సురక్షితమేనా..?

### అనుమానాలకు చెక్ పెట్టాల్సిందే..!




ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్చి 15 తర్వాత కొత్త డిపాజిట్లను స్వీకరించకుండా లేదా క్రెడిట్ లావాదేవీలను అనుమతించకుండా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతా/ వాలెట్‌ను నియంత్రిస్తూ ఆదేశాన్ని జారీ చేసింది. అయితే పేటీఎం ద్వారా పెట్టుబడి పెట్టిన మన సొమ్ము ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్లు లేదా ఎన్‌పీఎస్ పెట్టుబడుల పరిస్థితి ఏంటి? అనే అనుమానం చాలా ఉంటుంది. ఈ నేపథ్యంలో పేటీఎం ఇటీవల ఎఫ్ఏక్యూలను రిలీజ్ చేసింది. ప్రస్తుత రోజుల్లో భవిష్యత్ అవసరాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పెట్టుబడి పెట్టడం పరిపాటిగా మారింది. 2016 నోట్ల రద్దు సమయంలో లైమ్‌లైట్‌లోకి వచ్చిన పేటీఎం ద్వారా కొంత మంది పెట్టుబడిదారులు వివిధ పెట్టుబడి పథకాల్లో పెట్టుబడి పెట్టారు. అయితే ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్చి 15 తర్వాత కొత్త డిపాజిట్లను స్వీకరించకుండా లేదా క్రెడిట్ లావాదేవీలను అనుమతించకుండా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతా/ వాలెట్‌ను నియంత్రిస్తూ ఆదేశాన్ని జారీ చేసింది. అయితే పేటీఎం ద్వారా పెట్టుబడి పెట్టిన మన సొమ్ము ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్లు లేదా ఎన్‌పీఎస్ పెట్టుబడుల పరిస్థితి ఏంటి? అనే అనుమానం చాలా ఉంటుంది. ఈ నేపథ్యంలో పేటీఎం ఇటీవల ఎఫ్ఏక్యూలను రిలీజ్ చేసింది. ఈ ఎఫ్ఏ?క్యూల్లో మన అనుమానాలన్నీ నివృత్తి చేసుకోవచ్చు. కాబట్టి పేటీఎం ఎఫ్ఏక్యూల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.


# సుదీర్ఘ ఎన్నికలతో ప్రతిపక్షాలకు నష్టం

- డబ్బు, ప్రచారంలో వెనుకబడిపోతాం
- అన్ని పార్టీలకూ సమాన అవకాశాలు ఏవీ
- ఎన్నికల కమిషన్ వివేచననే ప్రశ్నిస్తున్నాం
- **1952 తర్వాత సుదీర్ఘంగా జరుగుతున్న ఎన్నికలు ఇవే**
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: దేశంలో అత్యంత సుదీర్ఘకాలం జరుగుతున్న రెండవ ఎన్నికలైన ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు ప్రత్రిపక్షాలకు ప్రతికూలంగా మారాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకునే సంపూర్ణ హక్కు ఎన్నికల కమిషన్‌కే ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదని, అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న వివేచననే తాము ప్రశ్నిస్తున్నామని పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు 82 రోజుల పాటు జరగనున్నాయి. మార్చి 16 ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ జూన్ 4న ఫలితాల వెల్లడితో ముగియనున్నది. ఇంత సుదీర్ఘ కాలం ఎన్నికలు జరగడం గురించి ప్రశ్నించగా ఇది చాలా ఆందోళన కలిగించే విషయమని ఆయన చెప్పారు. ఎన్నికల ప్రక్రియపై సర్వాధికారాలు ఎన్నికల కమిషన్‌కే రాజ్యాంగం కల్పిస్తోందని, దీన్ని తాము కూడా గుర్తిస్తున్నామని ఆయన చెప్పారు. అయితే దీని వెనుక ఉన్న వివేచననే తాము ప్రశ్నిస్తున్నామని ఆయన చెప్పారు. సాంకేతికంగా అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న కాలంలో ఎన్నికల నిర్వహణ తగ్గాల్సింది పోయి పెరిగిపోతోందని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పురుడుపోసుకున్న రోజుల్లో తొలి లోక్‌సభ ఎన్నికలు 1952లో సుదీర్ఘకాలం పాటు జరిగాయని, ఆ తర్వాత అంత అత్యధిక రోజులు ఎన్నికలు జరుగుతున్నది ఇప్పుడేనని ఆయన తెలిపారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న ఈ రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ తగ్గడానికి బదులు పెరిగిందని ఆయన తెలిపారు. దీని వల్ల ఎన్నికలలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు దక్కబోవని ఆయన అభిప్రాయపడ్డారు. డబ్బు, ప్రచారం విషయంలో ప్రతిపక్షాలకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. భౌతిక ప్రచారం విషయంలో అధికార పక్షానికి ఉన్న సానుకూల పరిస్థితులు ప్రతిపక్షాలకు ఉండవని ఆయన చెప్పారు. అధికార పార్టీ నాయకులు ఒక దశ నుంచి మరో దశకు వేగంగా కదలిపోగలరని, గతంలో ప్రచారం తర్వాత ఓటింగ్ జరిగేదని, కాని ఇప్పుడు ఒక దశ తర్వాత మరో దశగా వరుసగా ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఒక దశలో పోలింగ్ జరుగుతుంటే మరో దశలో ప్రచారం జరుగుతుంటుందని, ప్రధాని, కేంద్ర మంత్రులు, అధికార పార్టీ నాయకులు తమకు ఉన్న ఆర్థిక బలంతో వేగంగా ఒక చోటు నుంచి మరో చోటికి కదులుతూ ప్రచారంలో చెప్పే మాటలు పోలింగ్ జరిగే వేరే చోట కూడా ప్రసారం అవుతుంటాయని ఆయన తెలిపారు. దీని వల్ల అధికార పార్టీకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన చెప్పారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా అని ఏచూరి ప్రశ్నించారు. పోలింగ్ జరిగే నియోజకవర్గంలో 48 గంటలకు ముందు ప్రచారాన్ని నిలిపివేయాలని, కాని వేరే చోట ప్రచారం కొనసాగుతుండడం కోడ్ ఉల్లంఘన కాదా అని ఆయన ప్రశ్నించారు. బిజెపి బలహీనంగా కేడర్ బలం అంతగా లేని రాష్ట్రాలో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి కేడర్‌ను తరలించేందుకు ఏడు దశల పోలింగ్ అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు. ఏ రకంగా చూసిన ఇంత సుదీర్ఘ ఎన్నికల వల్ల ప్రతిపక్షాలకు ప్రతికూల పరిస్థితులే అధికంగా ఉన్నాయని ఆయన చెప్పారు. డబ్బు, ప్రజలకు చేరువ కావడంలో అధికార పక్షానికే ఎక్కువ అనుకూలత ఉంటుందని ఆయన చెప్పారు. ప్రస్తు త లోక్‌సభ ఎన్నికలు 44 రోజులకు పైగా జరగనున్నాయి. 1951-52 నాటి లోక్‌సభ ఎన్నికలు నాలుగు నెలలకు పైగా జరిగాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల ప్రక్రియగా పరిగణించే భారత పార్లమెంటరీ ఎన్నికలు ఏప్రిల్ 19న ప్రారంభమై జూన్ 4న ఎన్నికల ఫలితాల ప్రకటనతో ముగియనున్నాయి. కాగా..ఎన్నికల షెడ్యూల్ విడుదల సందరగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల తేదీలను భౌగోళిక పరిస్థితులు, ప్రభుత్వ సెలవులు, పండుగలు, పరీక్షలు వంటి అంశాల ప్రాతిపదికన నిర్ణయించినట్లు తెలిపారు.

## వ్యతిరేకించే కుటుంబాల తోనే బిజెపికి సమస్య : ఒమర్ అబ్దుల్లా




వంశరాజకీయాలతో బీజేపీకి సమస్యలేదని, ఆ పార్టీని వ్యతిరేకించే కుటుంబాలతోనే సమస్యలని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గురువారం వ్యాఖ్యానించారు. బీహార్‌లో చిరాగ్ పాశ్వాన్‌తో బీజేపీ పొత్తుపెట్టుకుందని, మహారాష్ట్రలో పొత్తు కోసం రాజ్‌థాకరేతో కేంద్రమంత్రి అమిత్‌షా మంతనాలు జరుపుతున్నారని, గ్వాలియర్‌లో జ్యోతిరాదిత్య సింధియా కుటుంబానికి చెందిన అభ్యర్థి గుణ నుంచి పోటీ చేయడం లేదా ఇవన్నీ కుటుంబ రాజకీయాలకు ఉదాహరణ కాదా ? అరి ఆయన ప్రశ్నించారు. వంశరాజకీయాలతో బీజేపీకి ఎలాంటి సమస్య లేదని, ఆ పార్టీని వ్యతిరేకించే కుటుంబాల తోనే సమస్యలని, తాను మాత్రం బీజేపీని వ్యతిరేకిస్తానని గర్వంగా చెప్పుకుంటానని అబ్దుల్లా విలేఖర్ల సమావేశంలో వ్యాఖ్యానించారు. కశ్మీర్ లోని మూడు లోక్‌సభ స్థానాలకు నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థులను రంగం లోకి దింపడం లేదా అన్న ప్రశ్నకు తగిన సమయంలో పేర్లు ప్రకటిస్తామని చెప్పారు. తమ నియోజకవర్గాలకు మూడు,, నాలుగు, ఐదు దశల్లో ఎన్నికలు జరగనున్నాయని, అందువల్ల చాలా సమయం ఉందన్నారు. బీజేపీ నేత చౌదరి లాల్ సింగ్‌ను కాంగ్రెస్ వెనక్కు తీసుకోవడంపై అడగ్గా అది కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమని పేర్కొన్నారు. లాల్‌సింగ్ 2018లో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నిందితులకు మద్దతు ఇచ్చిన వ్యక్తి. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి కథువా నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థిగా లాల్‌సింగ్ పోటీ చేస్తే ఇండియా కూటమిలో భాగస్వామి అయిన నేషనల్ కాన్ఫరెన్స్ సింగ్‌కు మద్దతు ఇవ్వవలసి ఉంటుంది.

## చైనా వీసా కేసులో కార్తీకి అరకోటి



న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం చైనా వీసా కేసులో రూ 50 లక్షల లంచం తీసుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం అభియోగాలు మోపింది. కేంద్ర మాజీ హెూం, ఆర్థిక శాఖ మంత్రి అయిన చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం. ఆయన తన అత్యంత సన్నిహితుడి ద్వారా అరకోటి తీసుకున్నాడనేది ఇడి అభియోగం. పంజాబ్‌లో విద్యుత్ కేంద్రం స్థాపించే ఓ కంపెనీకి చెందిన చీనీ ఉద్యోగి వీసాకు సంబంధించి కార్తీ తన అధికారాన్ని, పలుకుబడిని వినియోగించుకున్నాడని, హెూం మంత్రిత్వశాఖ ద్వారా చైనా వీసా తిరిగి వాడుకోవడంలో సాయం చేశాడని ఇడి పేర్కొంది. కాగా కార్తీకి ఈ మొత్తం ఆయన అధీనంలో ఉన్న ఓ కంపెనీలోకి అక్రమ , తప్పుడు నగదు చెల్లింపుల లావాదేవీల ద్వారా చేరిందని కూడా తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఈ ఎంపి నుంచి ఈ కేసులో దర్యాప్తు సంస్థ పలుసార్లు వాంగ్మూలం తీసుకుంది. కాగా తిరిగి ఈ కేసు ప్రస్తావన వచ్చిన దశలో కార్తీ స్పందించారు. కోర్టులో విచారణ దశలో తమ లాయర్లు తగు సమాధానం ఇస్తారని స్పష్టం చేశారు.

## ఆయనే ఢిల్లీ సీఎంగా ఉంటారు.. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత మంత్రి అతిశీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కేసులో అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడంతో తర్వాత ముఖ్యమంత్రిగా ఎవరు కొనసాగుతారనేది ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత అతిశీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీకి అరవింద్ కేజ్రీవాల్‌నే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. జైలు నుంచే కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని నడిపిస్తారని అతిశీ వెల్లడించారు. ముఖ్యమంత్రిని ఈడీ అరెస్టు చేయడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని చెప్పారు. దీనిపై ఇవాళ రాత్రే విచారణ జరపాలని కోరామని తెలిపారు. కాగా, ఢిల్లీ మద్యం కేసులో ఇప్పటివరకు ఆప్ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ఇదే కేసులో ఈడీ అధికారులు ఇప్పటివరకు తొమ్మిదిసార్లు కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేశారు. కానీ ఆయన హాజరుకాలేదు. ఈ క్రమంలో ఇవాళ కేజ్రీవాల్ ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు దాదాపు రెండున్నర గంటల పాటు ఆయన్ను ప్రశ్నించారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.

### ఎలక్టోరల్ బాండ్ల బండారం బట్టబయలు...

# సుప్రీంలో ఎస్‌బిఐ అఫిడవిట్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు నుంచి మందలింపును ఎదుర్కొన్న తర్వాత భారతీయ స్టేట్ బ్యాంకు(ఎస్‌బిఐ) గురువారం ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. దాతల నుంచి విరాళాలు అందుకున్న రాజకీయ పార్టీలను గుర్తించే ఎన్నికల బాండ్లకు చెందిన అన్ని సీరియల్ నంబర్లు కూడా ఎస్‌బిఐ మసర్పించిన వివరాలలో ఉన్నాయి. ఈ మేరకు ఎస్‌బిఐ గురువారం సుప్రీంకోర్టుకు ఒక అఫిడవిట్‌ను సమర్పించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను వెల్లడించామని, కంప్లీట్ అకౌంట్ నంబర్లు, కెవైసి వివరాలు తప్ప తమ వద్ద వేరే వివరాలేవీ ఉంచుకోలేదని ఎస్‌బిఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఎస్‌బిఐ అందచేసిన వివరాలను ఎన్నికల కమిషన్ మరి కొద్ది గంటల్లో తన అధికారిక వెబ్‌సైట్‌లో అవ్‌లోడ్ చేయనున్నది. కాగా..ఎస్‌బిఐ ఇదివరకు ఎన్నికల మిషన్‌కు ఎన్నికల బాండ్లకు సంబంధించి రెండు జాబితాలను అందచేసింది. మార్చి 14న వీటిని ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. మొదటి జాబితాలో దాతల పేర్లు, బాండ్ల విలువ, వాటిని కొనుగోలు చేసిన తేదీలు ఉన్నాయి. రెండవ జాబితాలో రాజకీయ పార్టీల పేర్లు, బాండ్ల విలువ, వాటిని ఎన్‌క్యాష్ చేసుకున్న తేదీలు ఉన్నాయి. బాండ్లపై ఉన్న యూనిక్ అల్ఫాన్యూమరిక్ కోడ్(సీరియల్ నంబర్లు) వివరాలు లేకుండా ఏ రాజకీయ పార్టీకి ఏ దాత విరాళం అందచేశారో గుర్తించడం చాలా కష్టం. అల్ట్రావైలెట్ లైట్‌ని ఉపయోగించి మాత్రమే అల్ఫాన్యూమరిక్ కోడ్‌ను చూడగలం. మార్చి 21వ తేదీ సాయంత్రం 5 గంటల కల్లా సీరియల్ నంబర్లతోసహా బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని ఎస్‌బిఐని సుప్రీంకోర్టు గత సోమవారం ఆదేశించింది. అంతేగాక తాము పూర్తి వివరాలను వెల్లడించామని తెలియచేస్తూ ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఎస్‌బి చైర్ పర్సన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన అసమగ్ర సమాచారాన్ని ఎస్‌బిఐ అందచేసిందని ఫిర్యాదు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. మీ వద్ద ఉన్న ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు మాకు కావాలి. మీకేం కావాలో చెబితే అది వెల్లడిస్తాం అన్నట్లు ఉంది ఎస్‌బిఐ వ్యవహార శైలి. అది మంచి పద్ధతి కాదు. మేము అన్ని వివరాలు అందచేయాలి అంటే దాని అర్థం మీ వద్ద ఉన్న అన్ని వివరాలు అని. ఏ వివరాలను దాచలేదు అని నుంచి అఫిడవిట్ కూడా కావాలి అని సిజెఐ చంద్రచూడ్ గత సోమవారం ఎస్‌బిఐని ఉద్దేశించి హెచ్చరించారు. ఎస్‌బిఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖేరా పేరిట గురువారం దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ కింద వివరాలను మరోసారి సమర్పిస్తున్నామని పేర్కొంది. బాండు కొనుగోలుదారుడి పేరు, బాండు డినామినేసన్, స్పెసిఫిక్ నంబరు, బాండును ఎన్‌క్యాష్ చేసుకున్న పార్టీ పేరు, రాజకీయ పార్టీల బ్యాంకు ఖాతా నంబరు చివరి నాలుగు అంకెలు, ఎన్‌క్యాష్ చేసుకున్న బాండు డినామినేషన్, నంబరు.




## ధ్వంసమైన అడవులను కంటికి రెప్పలా కాపాడిన దార్శనికుడు కెసిఆర్ : కెటిఆర్

హైదరాబాద్ : తెలంగాణ హరితహారం గురించి గుర్తు చేసుకుంటు అటవీ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గురువారం ఆసక్తికర ట్వీట్ చేశారు. ఇందులో దశాబ్దాల పాటు ధ్వంసమైన అడవులను కంటికి రెప్పలా కాపాడిన దార్శనికుడు కెసిఆర్ అని, తెలంగాణలో మహెూద్యమంలా సాగిన ఆనాటి హరితహారం 230 కోట్ల మొక్కలు నాటాలన్న సంకల్పం ప్రపంచ చరిత్రలోనే మూడో అతిపెద్ద మానవ ప్రయత్నమని వెల్లడించారు. 15 వేల నర్సరీల పెంపకం మహాయజ్ఞంలో సరికొత్త అధ్యాయంగా సాగిందని, వీటితో గ్రీన్ కవర్ 8 శాతం పెరిగిందని, తెలంగాణ పునర్నిర్మాణం అంటే ప్రజల బతుకు చిత్రాన్ని మార్చడమే కాదు, సకల జీవరాశులను సంరక్షించడమన్నారు. హరితహా రంలో భాగంగా నాటిన మొక్కలను, బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేసిన పార్కుల ఫోటోలను ట్వీట్‌కు కెటిఆర్ జత చేశారు.




## అరుణాచల్ భారత్‌దే.. చైనా తీరుపై అమెరికా ఆగ్రహం

వాషింగ్టన్: భారత భూభాగమైన అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా అసంబద్ధ వైఖరిని అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా తప్పుబట్టింది. ఆ భూభాగం ఎప్పటికీ భారత్‌దేనని తేల్చి చెప్పింది. దాన్ని మార్చడానికి చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ ప్రిన్సిపల్ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ బుధవారం వెల్లడించారు. వాస్తవాధీన రేఖ వెంట చేసే ఆక్రమణ యత్నాలను తిప్పికొడుతున్నట్లు స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌పై గత కొన్నేళ్లగా చైనా మొండి వాదనలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతం తమ భూభాగంలోనిదేనని ఇటీవల ఆ దేశ రక్షణశాఖ అధికార ప్రతినిధి సీనియర్ కర్నల్ ఝూంగ్ షియాంగాంగ్ అసంబద్ధ వాదనలకు దిగారు. దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. నిరాధార వాదనల ద్వారా వాస్తవాలు మారిపోవని స్పష్టం చేసింది. అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో అక్కడి పౌరులు ప్రయోజనం పొందుతూనే ఉంటారని విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.



### సీఎం కుర్చీకి ఎసరు పెడతారనే భయం పట్టుకుంది..

## రేవంత్ రెడ్డిపై మందకృష్ణ సంచలన వ్యాఖ్యలు!




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. మాదిగల తరపున మాట్లాడితే.. మాలలు తన సీఎం కుర్చీకి ఎసరు పెడుతారని రేవంత్‌కు భయం పట్టుకుంది. భట్టి పట్టుబట్టి అనుకున్నది సాధించుకున్నాడు. ఒక వేళ రేవంత్ దిగిపోతే, తాను సీఎం అవ్వాలని కాచుకుని కూర్చున్నడు భట్టి. నాగర్‌కర్నూల్‌లో సంపత్‌కు టికెట్ రాకుండా రేవంతే అడ్డుకుంటున్నాడు అని మందకృష్ణ మాదిగ సంచలన వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రెడ్డినేమో ముఖ్యమంత్రి.. మాలనేమో డిప్యూటీ సీఎం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోదరుడు మల్లు రవి కేబినెట్ హెూదాలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి. స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ కూడా మాలనే. 30 ఏండ్లుగా పార్టీకి సేవలందిస్తున్న సంపత్ కుమార్‌కు అవకాశాలు ఇవ్వడం లేదు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వంలో మాకు గాడ్ ఫాదర్లు లేకపోవడంతోనే పదవులు, సీట్లు దక్కడం లేదు. వాళ్లకు గాడ్ ఫాదర్లు ఉన్నారు కాబట్టే అటు పదవులు, ఇటు సీట్లు దక్కుతున్నాయని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

**మాదిగలకు మొదట్నుంచి మోసమే..**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కర్ణాటకకు చెందిన మాల. గతంలో జాతీయ అధ్యక్షులుగా పని చేసిన దామోదరం సంజీవయ్య, బీ శంకరానంద్ కూడా మాల కులానికి చెందిన వారే. తెలంగాణలో మాదిగల జనాభా చూడరు. మా నాయకుల సేవలు కూడా పరిగణనలోకి తీసుకోరు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 85 శాతం మాదిగలు ఉన్నారు. సంపత్ చేత ఊడిగం చేయించుకునేందుకు జాతీయ కార్యదర్శిగా పెట్టుకుంటారు. సొంత జిల్లాలో పోటీ చేస్తానంటే సంపత్‌కు ప్రాధాన్యత ఇవ్వరు. మాకు సీట్లు, పదవులు ఇప్పించే పలుకుబడి గల నాయకులు మాకు లేరు. కాంగ్రెస్ పార్టీలో మొదట్నుంచి మోసమే జరిగింది.. ఇప్పుడు కూడా మోసమే జరుగుతుందని మందకృష్ణ మండిపడ్డారు. తెలంగాణలో పరిశీలిస్తే మల్లు అనంతరాములు, జీ వెంకటస్వామి పీసీసీ అధ్యక్షులు అయ్యారు. మల్లు అనంతరాములు ఎంపీగా పని చేశారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com